RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 1 సంచిక: 2 20-6-2025 శుక్రవారం ఎడిటర్ :ముర్రి పవీన్ పేజీలు : 8 వెల 4 /-

# భారత్–పాక్ యుద్ధాన్ని ఆపింది నేను కాదు..

## తొలిసారి క్రెడిట్ వదులుకున్న ట్రంప్




**(టుడే విదుర):** గత నెలలో భారత్–పాకిస్థాన్ మధ్య చెలరేగిన ఉద్రిక్తతలు యుద్ధానికి దారి తీస్తాయని ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది భయపడ్డారు. అయితే అంత దూరం వెళ్లకుండా ఇరు దేశాల అధినేతలు సంయమనం పాటించి కాల్పుల విరమణకు అంగీకరించారు. అయితే రెండు దేశాల మధ్య యుద్ధాన్ని తానే ఆపించానని అప్పట్నుంచి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఆయన ఏ దేశానికి వెళ్లినా అదే పాట పాడుతూ క్రెడిట్ తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ ప్రకటనపై తాజాగా స్పందించిన భారత ప్రధాని మోదీ ( కాల్పుల విరమణలో అమెరికా ప్రమేయం లేదని తేల్చి చెప్పారు. ఈ మేరకు ట్రంప్‌తో కూడా మోదీ మాట్లాడినట్టు ప్రకటన వెలువడింది. తాజాగా పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసిఫ్ మునీర్‌కు ట్రంప్ విందు ఇచ్చారు. ఆ విందు అనంతరం ఓవల్ ఆఫీస్‌లో వారిద్దరూ మీడియాతో మాట్లాడారు. ఆ సమావేశంలో ట్రంప్ అసలు నిజం వెల్లడించారు. 'భారత్–పాకిస్థాన్ అధినేతలు యుద్ధాన్ని కొనసాగించకూడదని తెలివైన నిర్ణయం తీసుకున్నారు. రెండు అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధం మంచిది కాదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

# యోగాపై ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్లాసెస్: చంద్రబాబు



అమరావతి, **(టుడే విదుర):** 11వ యోగా అంతర్జాతీయ దినోత్సవాన్ని ఈనెల 21న విశాఖపట్నంలో నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గురువారం యోగాంధ్రపై ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. యోగా జీవితంలో భాగం కావాలన్నారు. ఇది మనకు వారసత్వంగా వచ్చిన సంపద అని తెలిపారు. శస్త్ర చికిత్స కన్నా నివారణ మంచిదని.. యోగా కూడా అలాంటిదే అని అన్నారు. యోగాపై భవిష్యత్తులో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ, కోర్సులు నిర్వహిస్తామని చెప్పారు. యోగా నెలను డిక్లేర్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. యోగా కోసం 2 కోట్ల మందిని రిజిస్ట్రేషన్ చేయాలనుకున్నామని.. కానీ 2.30 కోట్ల మంది రిజిస్టర్ అయ్యారన్నారు. 120 శాతం లక్ష్యం సాధించామని చెప్పుకొచ్చారు. 88.71 శాతం మంది ప్రజలు యోగాలో పాల్గొంటున్నారని వెల్లడించారు. విశాఖలో ప్రపంచ యోగా దినోత్సవం పెద్ద ఈవెంట్‌గా నిర్వహించబోతున్నామని.. ఇది గిన్నిస్ బుక్‌లో ఎక్కబోతుందన్నారు. బాడీ ఫిట్‌నెస్‌కు, వ్యాధులు రాకుండా నిరోధించేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. వ్యాధులు వస్తే మెడిసిన్స్ వాడటం, శస్త్ర చికిత్సలు చేయించుకోవడం మంచిది కాదన్నారు.

# బ్రిటన్ మాజీ ప్రధానితో లోకేష్ భేటీ..

## చర్చించిన అంశాలివే

న్యూఢిల్లీ, **(టుడే విదుర):** ఢిల్లీలో ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా బ్రిటన్ మాజీ ప్రధాని, టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ) వ్యవస్థాపకులు టోనీ బ్లేయిర్‌తో మంత్రి సమావేశమయ్యారు. ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యలో ఏఐ టూల్స్ వినియోగంపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి ఎజెండా, స్కిల్ సెన్సస్, దేశం వెలుపల యువతకు ఉపాధి వంటి అంశాల్లో టీబీఐ సాంకేతిక మద్దతుపై ఈ సమావేశంలో చర్చించారు.



నైపుణ్య శిక్షణ అంశాలు, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ స్థాపనకు సహకారంపై ఒప్పందం కుదిరింది. అలాగే ఉన్నత విద్యలో సంస్కరణలు, సాంకేతిక మద్దతుపై సమీక్ష నిర్వహించారు. ఈరోజు (గురువారం) న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో టోనీ బ్లెయిర్‌ను మంత్రి లోకేష్ కలుసుకుని పలు అంశాలపై చర్చించారు. గత ఏడాది జులై నెలలో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌ను మంత్రి లోకేష్ ముంబైలో కలిశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యావ్యవస్థలో ఏఐ టూల్స్‌ను ఉపయోగించడానికి టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ) ద్వారా సహకరించేందుకు టోనీ బ్లెయిర్ అంగీకరించారు. ఆ మేరకు విద్యారంగంలో అధునాతన సాంకేతికతను అమలు చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడానికి ఏపీ విద్యాశాఖ, టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టీబీఐ)మధ్యం 2024 డిసెంబర్‌లో ఒప్పందం కుదిరింది.

# నాలుగోసారి సిట్ ముందుకు ప్రభాకర్ రావు

హైదరాబాద్, **(టుడే విదుర):** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. నాలుగోసారి ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. 2023 నవంబర్ 15న 600 మంది ఫోన్లు ట్యాప్‌పై ప్రభాకర్ రావును సిట్ ఆఫీసర్లు విచారిస్తున్నారు. ఈరోజు జరిగే విచారణ చాలా కీలకమనే చెప్పుకోవచ్చు. ఇప్పటి వరకు ఎవరెవరి ఫోన్లు ట్యాప్ జరిగిందనే దానిపై ప్రణీత్ రావు, తిరుపతన్న, భుజంగరావు, రాధాకిషన్‌రావు ఇచ్చిన స్టేట్‌మెంట్లపై సుదీర్ఘంగా మూడు సార్లు విచారణ జరిపి ప్రభాకర్ రావు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు సిట్ అధికారులు. ఈరోజు నాలుగో సారి విచారణలో భాగంగా




వ్యక్తిగతంగా చేసిన ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ జరుపనున్నట్లు తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా 2023, నవంబర్ 15న ఏకంగా 600 మంది ఫోన్లు ట్యాప్ అయ్యాయి. వీరి ఫోన్ ట్యాప్‌కు సంబంధించి కచ్చితంగా నిబంధనలకు విరుద్ధంగా నడిచిందని గుర్తించిన సిట్.. దీనిపై ప్రభాకర్ రావును ప్రశ్నిస్తున్నారు.

# చిత్తశుద్ధితో పని చేస్తున్నాం..

అమరావతి,**(టుడే విదుర)** : 'రాజకీయాల్లో, ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలి. అలా నిరంతరం పరితపించే నేను గత సంవత్సర కాలంలో చేపట్టిన శాఖల ద్వారా చేసిన అభివృద్ధిని, సాధించిన విజయాలను ప్రజలందరి ముందు ఉంచడం నా నైతిక బాధ్యత. అధికార బాధ్యతలు స్వీకరించి సంవత్సరం అయిన సందర్భంగా ఈరోజు మీ ముందుకు తీసుకొస్తున్నాను..' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్?కల్యాణ్? పేర్కొన్నారు.

ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణ, అటవీ, సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రిగా పవన్?కల్యాణ్? బాధ్యతలు చేపట్టి గురువారంతో సంవత్సరం పూర్తైన సందర్భంగా సమగ్ర అభివృద్ధి నివేదిక విడుదల చేశారు. దీనితో పాటు పవన్?కల్యాణ్? ఓ లేఖను విడుదల చేశారు. 'ప్రియమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు%ొ% గత సంవత్సరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయానికి అండగా నిలబడి, రాష్ట్రాన్ని బానిస సంకెళ్లు నుండి విముక్తి చేసిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను..' అని ఆయన పేర్కొన్నారు. 2019 నుండి 2024 వరకు ఐదేళ్ల కాలంలో రాష్ట్రం నియంతృత్వ పాలకుల పాలనలో నలిగిపోయింది, అభివృద్ధికి దూరమైంది, శాంతిభద్రతలు క్షీణించాయి, యువత భవిష్యత్తుపై నీలి మేఘాలు కమ్ముకున్నాయి, మహిళలకు రక్షణ కరువైం దని తెలిపారు. రాష్ట్ర రాజధాని నిర్మాణంలో ఒక్క ఇటుక కూడా కదలకుండా నిర్మానుష్యంగా మారిన సమయంలో రాష్ట్రాన్ని రక్షించేందుకు, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిపాలనను పునరుద్ధరించేందుకు నరేంద్ర మోదీ నేతృత్వంలో, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ప్రజల పక్షాన ఎల్లవేళలా నిలబడి పోరాడే మన సమిష్టి సహకారంతో ఎన్?డీఏ కూటమి 164 అసెంబ్లీ సీట్లను గెలిచి 94% స్ట్రైక్ రేట్ తో చారిత్రాత్మక విజయం సాధించిందన్నారు. ఇంతటి గెలుపును అందించిన ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు, మళ్లీ రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అహర్నిశలు కృషి చేస్తూ సంవత్సర కాలంలోనే గత ఐదేళ్లలో జరగని అభివృద్ధిని చేసి చూపిస్తూ, ప్రజల్లోనే కాకుండా, పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపడానికి కృషి చేశామన్నారు.

**సుపరిపాలనకు కేంద్ర సహకారం:**

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, సుపరిపాలనను చూసి నేడు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారాలు అందిస్తుండటంతో రాష్ట్రం అన్ని రంగాల్లో సమిష్టి అభివృద్ధి సాధిస్తూ స్వర్ణాంధ్ర 2047 సాధించే దిశగా అడుగులు వేస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ: పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల సమగ్ర నివేదికను ప్రజలందరూ నిశితంగా పరిశీలించి ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, మీరు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేయాలనే మా సంకల్పాన్ని గుర్తిస్తారని ఆశిస్తున్నాను అని ఆయన పేర్కొన్నారు.

**గత ఐదేళ్ళలో నియంతృత్వ పాలన..:**

గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రం నియంతృత్వ పాలకుల పాలనలో నలిగిపోయిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి ఏడాదిగా చిత్తశుద్ధితో పని



## ఏపీని అభివృద్ధికి చిరునామాగా మారుస్తాం

## ఏడాది సుపరిపాలనపై ప్రగతి నివేదిక

## సీఎం చంద్రబాబు పాలనలో

## రాష్ట్రం ముందుకెళ్తోంది

చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై పవన్ కల్యాణ్ ప్రగతి నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఎన్డీయే కూటమి విజయానికి అండగా నిలబడిన ప్రతిఒక్కరికీ, అలానే రాష్ట్రాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేసిన ప్రతిఒక్కరికీ పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.

**పెట్టుబడిదారుల్లో విశ్వాసం నింపాం..:**

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చేవారిలో విశ్వాసం నింపామని అలానే కేంద్ర ప్రభుత్వం కూడా అభివృద్ధి కార్యక్రమాలకు అండగా నిలుస్తోందని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం, దూరదృష్టి నాయకుని పాలనలో రాష్ట్రం ముందుకెళ్తోందని అన్నారు. రాబోయే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధికి చిరునామాగా మారుస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

# సాగిపోండి... సాఫీగా

- ఏడాదికి రూ.3 వేలు చెల్లిస్తే చాలు
- టోల్‌ప్లాజాల ద్వారా 200 సార్లు లేదా ఏడాది కాలానికి
- ప్రతిసారీ రీచార్జి చేసుకునే బాధ ఉండదు
- కార్లు, వేన్‌లు, జీపులకే పరిమితం
- ఉమ్మడి జిల్లాలో వాహనదారులకు ఆర్థిక వెసులుబాటు



**(టుడే విదుర):** ప్రతిసారీ ఫాస్టాగ్ రీచార్జి చేసుకునే చింత ఉండదు. ఏడాది కాలానికి ఒకేసారి రూ.3వేలు చెల్లిస్తే దేశంలో ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా వెళ్లే అవకాశాన్ని కల్పించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి అమల్లోకి రానున్న ఈ విధానంతో వాహనదారుల ప్రయాణం ఇక సాఫీగా సాగిపోతుంది. అయితే దీన్ని కార్లు, వేన్‌లు, జీపులకే పరిమితం చేశారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ రహదారి 16పై తుని–రాజమహేంద్రవరం మధ్యలోని కాకినాడ జిల్లా కృష్ణవరం, దివాన్‌చెరువు–సిద్ధాంతం మధ్యలోని డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ కోనసీమ జిల్లా ఈతకోట వద్ద టోల్‌ప్లాజాలు ఉండగా, 216వ జాతీయ రహదారిపై కత్తిపూడి–కాకినాడ బైపాస్ మధ్యలో గొల్లప్రోలు వద్ద, గురజనాపల్లి–పాశర్లపూడి మధ్య గల కోనసీమ జిల్లా అన్నంపల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ఇవన్నీ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉన్నాయి. వీటితోపాటు ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు వద్ద మరో టోల్‌ప్లాజా ఉంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏపీఆర్‌డీసీ ఆధీనంలో ఉంది. వీటి ద్వారా ప్రయాణాలు సాగించే అన్ని రకాల కార్లు, వేన్‌లు, ఫోర్‌వీల్ ఆటోలు, లారీలు, బస్సులు, ట్రాలీలు, ఇతర భారీ వాహనాలు ఆయా టోల్‌గేట్ల వద్ద నిర్ణీత రుసుమును ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ప్లాజా ద్వారా వెళ్లే ప్రతి వాహనానికి అక్కడ అమల్లో ఉన్న టోల్‌ఫీని వాహనానికి ఉన్న ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ప్లాజా దాటే సమయంలో ఆటోమెటిక్‌గా వాహనానికి చెందిన ఫాస్టాగ్ ద్వారా ఈ రుసుము కట్ అవుతుంది. ఒకవేళ ఫా స్టాగ్ సొమ్ములు లేకున్నా, వాహనానికి అసలు ఫాస్టాగ్ లేకున్నా నిర్ణీత రుసుము కంటే 100శాతం అదనంగా చెల్లించాలి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద ఇదే విధానం అమలవుతోంది. ఇకపై ఫాస్టాగ్ రీచార్జి తరచూ చేసుకునే ఇబ్బం ది లేకుండా ఏడాది రుసుము చెల్లించే విధానాన్ని అమలుల్లోకి తెచ్చింది. జాతీయ రహదారి ఫీ చట్టం 2008 కింద దీనిని అమల్లోకి తీసుకువస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఆగస్టు 15వ తేదీ నుంచి అమల్లోకి వచ్చే నూతన విధానం ప్రకారం ఏడాది కాలానికి రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫా స్టాగ్ రీచార్జి ఏడాది కాలానికి అమలులో ఉంటుంది. ఈ రీచార్జి చేయించిన వాహనం దేశంలోని జాతీయ రహదారులపై ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా 200 సార్లు ప్రయాణించే వీలుంది. ఏడాది లేదా 200 సార్లు ఏది ముందైతే దానిని పరిగణలోకి తీసుకుంటారు. ఏడాది కాలానికి ఫాస్టాగ్ తీసుకుంటే ప్రతి ఏటా ఏప్రిల్ 1వ తేదీన రీచార్జి చేయించుకోవాల్సి ఉంటుంది.

**వీటికి వర్తిస్తుంది..**

ఏడాది ఫాస్టాగ్ రూ.3వేల రీచార్జిని కార్లు, జీపులు, వేన్‌లకు పరిమితం చేశారు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం తిరిగే వాహనాలకే వీటిని వర్తింపజేశారు. వాణిజ్య అవసరాలకు తిరిగే వాహనాలకు ఇది వినియోగించుకునే అవకాశం ఉండదు. ముందుగా కార్లు, జీపులు, వేన్‌లకు దీనిని అమలుచేయడం ద్వారా పరిశీలన జరిపి దశలవారీగా అన్ని వాహనాలకు వర్తింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

**వాహనదారులకు లాభమే..**

ఏడాది లేదా 200సార్లు తిరిగేందుకు వీలుగా ఫా స్టాగ్ తీసుకోవడం వల్ల వాహనదారులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలుగుతుంది. గొల్లప్రోలు టోల్‌ప్లాజా ద్వారా కారు, జీపు వేన్‌లకు ఒకవైపు రూ.50 రుసుముగా ఉంది. దీని ప్రకారం 200 సార్లు ఇవి తిరిగితే పాత పద్ధతిలో రూ.10వేలు అవుతుంది. అదే నూతన విధానంలో రూ.3వేలు చెల్లిస్తే సరిపోతుంది. అదే కృష్ణవరం టోల్‌ప్లాజా వద్ద 200 ట్రిప్పులకు రూ. 22 వేలు, ఈతకోట వద్ద టోల్‌ప్లాజా వద్ద 25 వేలు వ్యయం అవుతుంది. రాష్ట్రంలోని ఇతర టోల్‌ప్లాజాల వద్ద ఇంతకంటే అధిక రుసుమలు వసూలు చేస్తున్నారు. దీనివల్ల సాధారణ పద్ధతుల్లో అయ్యే ఫాస్టాగ్ రుసుములో కేవలం 15 శాతం నుంచి 33 శాతం లోపుగా ఒకేసారి చెల్లిస్తే ఏడాదిపాటు లేదా 200 సార్లు ప్రయాణించే వీలుకలుగుతుంది. ఫాస్టాగ్ రీచార్జి విధానంపై ఆయా కేటగిరీల వాహనదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఈ టోల్‌ఫీ అన్ని రకాలుగా తమకు లాభదాయకమేనని చెబుతున్నారు.

# సచివాలయ ఏఎన్ఎంలకు రీ వెరిఫికేషన్

**ఆర్డర్ కాపీని అందజేస్తున్న డీఎంహెచ్‌వో**

**అభ్యర్థులందరికీ ఆర్డర్ కాపీలను అందజేసిన కాకినాడ డీఎంహెచ్‌వో**



(కాకినాడ – **(టుడే విదుర)** : కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో సచివాలయ ఏఎన్ఎంలు నుంచి మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్ (ఎంపీహెచ్ఏ)(ఎఫ్) లుగా పదోన్నతి పొంది గత కౌన్సిలింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు రీ వెరిఫికేషన్ ప్రక్రియ బుధవారం జరిగింది. కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ జె నరసింహానాయక్ ఈ ప్రక్రియను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి గతంలో కౌన్సిలింగ్‌కు హాజరై తమ స్థానాలు నిర్దేశించబడ్డ 390 మంది ఏఎన్ఎంలు ఈ రీవెరిఫికేషన్ ప్రక్రియకు హాజరయ్యారు. తాజా ప్రక్రియలో ఇద్దరు ఏఎన్ఎంలు అవకతవకలకు పాల్పడినట్లు వెల్లడయ్యింది. నిర్వహించిన కౌన్సిలింగ్‌లో వీరు అవకతవకలకు పాల్పడి బదిలీ ప్రయోజనాలు పొం దారు. ఓ ఏఎన్ఎం వివాహిత అయినా కూడా అవివాహితరాలన్న మినహాయింపులో బదిలీ ప్ర యోజనాలు పొందింది. అలాగే మరో ఏఎన్ఎం ప్రొహిబిషన్ పిరియడ్ డిక్లేర్ కాకపోయిన అయి పోయిందని బదిలీ దరఖాస్తులో పేర్కొంది. తా జాగా ఈ రెండు విషయాలు వెలుగులోకి వచ్చా యి. వీరిపై చార్జ్‌లు ఫ్రేమ్ చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో గత నిర్దేశించబడ్డ స్థానాల్లోనే కొందరు కొనసాగనుండగా ఇంకొందరికి ఆయా స్థానాల్లో మార్పు లు జరిగాయి. కౌన్సిలింగ్ ప్రక్రియ ఉదయం ప్రా రంభమై అర్ధరాత్రి వరకు కొనసాగింది. డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ఎనిమిదిమంది అధికారులు ఈ కౌన్సిలింగ్ నిర్వహించారు. రీ వెరిఫికేషన్ అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ అభ్యర్థులందరికీ ఆర్డర్ కాపీలను అందజేశారు. అయితే రీ కౌన్సెలింగ్‌లో అక్రమాలు జరిగాయని పలువురు ఏఎన్ఎంలు ఆరోపిస్తున్నారు.

## జిల్లాలో 4,500 ప్రాంతాల్లో నేటి నుంచి మూడు రోజులు యోగా శిక్షణ : కలెక్టర్




అమలాపురం, **(టుడే విదుర):** ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు యోగాసనాల శిక్షణ కార్యక్రమంలో భాగంగా కోనసీమ జిల్లావ్యాప్తంగా 4500 వేదికల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. సమావేశం అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ జిల్లాలోని వివిధ శాఖల అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. పండుగ వాతావరణంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు, ఆటస్థలాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, క్రీడా ప్రాంగణాలను ఇప్పటివరకు 4,500ను గుర్తించి శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు నమోదు ప్రక్రియ చేపట్టినట్టు తెలిపారు. యోగా అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొనేవారికి ప్రశంసా పత్రాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో రెండున్నర లక్షల మంది ఎన్‌రోల్మెంట్ పూర్తి చేసుకున్నారని తెలిపారు. విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి బస్సుల ద్వారా జనాన్ని తరలిస్తున్నామని తెలిపారు. ఈ సమీక్షలో డీఆర్వో రాజకుమారి, ఏవో కాశీవిశ్వేశ్వరరావు, డీఈవో షేక్ సలీంబాషా పాల్గొన్నారు. కాగా ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రొటోకాల్ ప్రకారం విజయవంతం చేయాలని జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలను కలెక్టర్ మంగళవారం ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా యోగాంధ్ర నిర్వహణ, తల్లికి వందనం కార్యక్రమాలపై మండల అధికారులకు జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

# విషాదం



## చెట్టును ఢీకొట్టిన బైక్ ముగ్గురు యువకుల మృతి బొండపల్లి సమీపంలో ఘటన

బొండపల్లి, **(టుడే విదుర):** ఆ ముగ్గురూ స్నేహితులు. ఒకరిది వేరే గ్రామం అయినప్పటికీ ఎప్పుడూ కలిసిమెలిసి ఉండేవారు. ఊరిలో వారాల పండుగ జరుగుతుండడంతో ముగ్గురు ఒక్కటిగా కేరింతలు కొడుతున్నారు. అందరినీ పలకరిస్తూ ఆనందంగా గడిపిన వారు బావిలో స్నానం చేద్దామని ఒకేబైక్‌పై బయలుదేరారు. ఊరు పొలిమేర దాటిన క్షణంలోనే రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టారు. చెల్లాచెదురుగా పడిపోయారు. రెప్పపాటులో ఇద్దరు ప్రాణాలు వదలగా మరొకరు ఆస్పత్రికి తరలించాక మృతిచెందాడు. బొండపల్లి గ్రామ సమీపంలో జరిగిన ఈ ఘటనలో నెల్లి రమణ (22), బుత్తల దినేష్(20), పురం సతీష్ (22) ప్రాణాలు కోల్పోయారు. బొండపల్లి గ్రామంలో వారాల పండుగ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం అందరినీ కలచివేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొండపల్లి యాతపేటకు చెందిన నెల్లి రమణ, పురం సతీష్, దత్తిరాజేరు మండలం వంగర గ్రామానికి చెందిన బుత్తల దినేష్‌లు స్నేహితులు. బొండపల్లిలో వారాల పండుగ జరుగుతుండడంతో దినేష్ బంధువుల ఇంటికి వచ్చాడు. ఉదయం ముగ్గురు కలుసుకుని కాసేపు మాట్లాడుకున్నాక నేలబావిలో స్నానం చేద్దామనుకున్నారు. చామలవలస వెళ్లే మార్గంలో బావి ఉండడంతో ఒకేబైక్‌పై బయలుదేరారు. ఊరు పూర్తిగా దాటనే లేదు. రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టారు. క్షణకాలంలో చెల్లాచెదురుగా పడిపోయారు. చుట్టుపక్కల వారు వచ్చి పరిశీలించే సరికి నెల్లి రమణ, బుత్తల దినేష్‌లు తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోయారు. కాస్త మెలకువతో ఉన్న సతీష్‌ను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనతో మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. అప్పటివరకు పండుగ సందడిలో ఉన్న గ్రామస్థులు విచారంలో మునిగారు. ఎస్ఐ యు.మహేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

## 29న కనకదుర్గమ్మకు బంగారు బోనాలు

**దుర్గగుడి ఈవో శీనానాయక్‌కు లేఖ అందిస్తున్న భాగ్యనగర్ మహంకాళీ బోనాల జాతర కమిటీ ప్రతినిధులు**



ఇంద్రకీలాద్రి, **(టుడే విదుర):** సప్తమాతృకలకు సప్త బంగారు బోనం సమర్పణ పేరుతో ఈనెల 29వ తేదీన భాగ్యనగర్ మహంకాళీ బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు బోనం, పట్టువస్త్రాలను సమర్పించనుంది. ఈమేరకు దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో శీనానాయక్‌కు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, ఎంపీ గౌడ్ తదితర ప్రతినిధులు లేఖ ఇచ్చారు. బంగారు బోనాల సమర్పణకు హైదరాబా ద్ నుంచి సాంస్కృతిక బృందాలతో సహా 500 మంది భక్తులు ఈనెల 28న విజయవాడకు చేరుకుంటారని ఆయన తెలిపారు. 29వ తేదీన ఉదయం బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి నుంచి బంగారు బోనాల ఊరేగింపు సాగుతుందని వివరించారు. వసతి, కనకదుర్గమ్మ దర్శనం, బోనం సమర్పణ, ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. బోనాల కమిటీ కోరిన అన్ని ఏర్పాట్లను లోటుపాట్లు లేకుండా చేయాలని అధికారులకు ఈవో సూచించారు.

## తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కి బ్రేకులు



నర్సీపట్నం,**(టుడే విదుర)** : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలకు బ్రేకులు పడ్డాయి. వాహనాలకు ఆయిల్ కొట్టించకపోవడంతో ఈ నెల 16వ తేదీ నుంచి ఏరియా ఆస్పత్రిలో నిలిపేశారు. జిల్లా మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు 2015 డిసెంబరు 31న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పురుడు పోసుకున్న తర్వాత బాలింతను, శిశువును క్షేమంగా ఇంటికి చేర్చడానికి ఈ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ నిర్వహణపై ప్రభుత్వం శ్రద్ధచూపలేదు. వీటి నిర్వహణ బాధ్యతను అరబిందో ఫార్మా కంపెనీకి అప్పగించింది. వాహనానికి ఇచ్చిన సిమ్ కార్డులో డబ్బులు వేసి అవసరం పడినప్పుడు పెట్రోల్ బంకులో ఆయిల్ కొట్టించుకునే విధంగా ఏర్పాటు చేశారు. అయితే ఈ నెల 16వ తేదీ నుంచి డబ్బులు పడక పోవడంతో వాహనాలకు ఆయిల్ కొట్టలేదు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 22 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఆగిపోయినట్టు తెలిసింది. మూడు రోజులుగా వాహనాలు నిలిచి పోవడంతో బాలింతలు ఆస్పత్రుల నుంచి ఇళ్లకు వెళ్లడానికి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తున్నది.

# ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ స్టాళ్లను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన

రామాపురం,(**టుడే విదుర**): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను తినడం ద్వారా సం పూర్ణ ఆరోగ్యం సాధ్యమని డాక్టర్లు వినోద్‌కుమార్, దివ్యశ్రీ తెలిపారు. రామాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలు, అకుకూరలు, దుంపజాతి, ఇతర పండ్ల రకాలతో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశా రు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫఏ పవన, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రవీంద్రగౌ డ్, రామాపురం మండలం మాస్టర్ ట్రైనర్ మధుకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్దతి ద్వారా పండించిన ఉత్పత్తుల ద్వారా మాత్రమే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి వెంకటమోహన, మోడల్ మేకర్ సదాశివరెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుధాకర్, హరి, ఆర్యో పర్యవేక్షకులు, ఏఎనయంలు ఇంకా ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

# 'మావాళ్లకే అవకాశమివ్వాలి'



ఎస్టేట్ అధికారిని నిలదీస్తున్న రైతులు, పొదుపు మహిళలు

రైతుబజార్ అధికారులు, సిబ్బందిపై రాజకీయ నాయకుల ఒత్తిడి

తామెక్కడికి పోవాలంటున్న రైతులు, పొదుపు మహిళలు

కర్నూలు (**టుడే విదుర**) : సీఎం చంద్రబాబు మే నెల 17వ తేదీన సి.క్యాంపు రైతుబజార్‌ను పర్యటించారు. ఆయన వెళ్లిపోయారో లేదో.. ఇక్కడ తిష్ట వేసేందుకు కొంతమంది నాయకులు, వారి అనుచరులు ఆరోజు నుంచి ఈరోజు వరకు చేయని ప్రయత్నాలంటూ లేవు. ఒక దశలో సి.క్యాంపు రైతుబజారు ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ వారి ఒత్తిడి తట్టుకోలేక ఇక్కడ తాను పని చేయలేనని, వేరే రైతుబజారుకు బదిలీ చేయించుకుని వెళ్లిపోతానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. సీ.క్యాంపు రైతుబజారులో తమ వారికే వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రతి రోజూ తెలుగు తమ్ముళ్లు అధికారులు, సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రైతుబజారుకు ప్రధాన రహదారి కోసం సీఎం పర్యటన సందర్భంగా కొంత మంది రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకునే వారి అంగళ్లను తొలగించారు. ప్రస్తుతం అక్కడ వాహనాల రాకపోకలు మాత్రమే జరిగేలా కలెక్టర్, ఎస్పీలు చర్యలు తీసుకున్నారు. దాదాపు 60మంది దాకా ఆ ప్రధాన రహదారి వద్ద కూరగాయలు అమ్ముకుని జీవనం చేసేవారు. వీరికి తప్పనిసరిగా ఉపాధి కల్పిస్తామని సి.క్యాంపు రైతుబజారును విస్తరించిన తర్వాత అక్కడ వ్యాపారం చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో పాటు కొత్తగా ఏర్పాటు కానున్న కల్లూరులోని గోవర్ధనగిరి రైతుబజారులో స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇస్తామని వారికి రైతుబజార్ అధికారులు నచ్చజెబుతూ వస్తున్నారు. వీరంతా చోటా, మోటా నాయకులతో సీ.క్యాంపు రైతుబజారులోనే వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలంటూ ప్రతి రోజు నాయకులతో ఫోన్లు, సిఫారసు లెటర్లు తీసుకువస్తుండటంతో రైతుబజారు అధికారులు, సిబ్బందికి దిక్కుతోచడం లేదు. బయటివారు రైతుబజారులోకి ప్రవేశిస్తే కొన్నేళ్లుగా ఈ రైతుబజారునే నమ్ముకుని కూరగాయలు అమ్ముకుంటున్న తామెక్కడికి పోవాలని రైతులు, పొదుపులక్ష్మి గ్రూపుల మహిళలు బుధవారం సీ.క్యాంపు రైతుబజారు కార్యాలయంలో ఎస్టేట్ అధికారిని ప్రశ్నించారు. ఒక్కసారిగా రైతులంతా వచ్చి ప్రశ్నిస్తుండటంతో రైతుబజారు అధికారులకు, సిబ్బందికి దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఏం సమాధానం చెప్పుకోవాలో అర్థంగాక తలపట్టుకుని కూర్చున్నారు. కలెక్టర్, జేసీ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, పొదుపుగ్రూపు మహిళలు మొర పెట్టుకుంటున్నారు.

# తోతాపూరి మామిడికి కిలోకు రూ.4 మద్దతు ధర



రైల్వేకోడూరు మామిడి యార్డులో రైతులకు పర్మిట్ అందజేస్తున్న ఉద్యానశాఖాధికారి భాస్కర్

కోడూరు ఉద్యాన శాఖాధికారి వెంకటభాస్కర్

రైల్వేకోడూరు, (**టుడే విదుర**): తోతాపూరి జ్యూస్ కాయలకు ప్రభుత్వం కిలోకు రూ.4 మద్దతు ధర ఇచ్చినట్లు రైల్వేకోడూరు ఉద్యాన శాఖ అధికారి ఎం.వెంకటభాస్కర్ తెలిపారు. ఆయన రైల్వేకోడూరు మామిడి యార్డును పరిశీలించి రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ రైతులు మండీల ద్వారాగాని, ఎఫ్‌పీఓల ద్వా రా గాని విక్రయించినప్పుడు తమ పేర్లను పర్మిట్‌లో న మోదు చేసుకుని గుజ్జు పరిశ్రమలకు తీసుకెళ్లాలన్నారు. గుజ్జు పరిశ్రమల వద్దకు కాయలను తీసుకుని వెళితే అక్కడ తమ సిబ్బంది ఉంటారని, వారికి 1-బీ, ఆధార్‌లింకు కలిగిన బ్యాంకు అకౌంట్ నెంబర్ ఉన్న పత్రాలను ఇచ్చి తమ పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోసి గుజ్జు పరిశ్రమలకు తరలించాల న్నారు. తోతాపూరి మామిడి రకానికి ఇచ్చే మద్దతు ధర రూ.4లు నేరుగా రైతు బ్యాంకు ఖాతాలోకి జమ అవుతుందన్నారు. గుజ్జు, జ్యూస్ పరిశ్రమల వారు కొన్న ధరను నేరుగా రైతుకు చెల్లిస్తారన్నా రు. వివరాల కోసం రైతు సేవా కేంద్రం సిబ్బంది లేదా ఉద్యాన అధికారులను సంప్రందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, మండీల వ్యాపారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సుండుపల్లె: మామిడి కేజీపై రూ.4 అదనంగా ఇస్తుందని ఉద్యానశాఖ అధికారిణి వనితాభాయి తెలిపారు. మండలంలోని మామిడికాయల మండీలను ఆమె పరిశీలించారు. ప్రతి రైతూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

# అక్రమాలు కొండంత..చర్యలు గోరంత



- ఇదీ జగతిమెట్ట జగనన్న కాలనీలో పరిస్థితి
- 150 వరకు అక్రమ పట్టాల గుర్తింపు
- రద్దు చేసింది 40 మాత్రమే
- మరో 18 పునాదులు తొలగింపు
- కీలక రికార్డులు మాయం
- కారణమైన అధికారులపై కానరాని చర్యలు

(**టుడే విదుర**): టెక్కలి మండలం జగతిమెట్ట జగనన్న ఇళ్ల కాలనీ అక్రమాల పుట్టగా తయారైంది. ఈ కాలనీలో వేసిన లేఅవుట్లు, పట్టాల కేటాయింపు ఇలా అన్నింట్లో కూడా భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇష్టారాజ్యంగా పొజిషన్ సర్టిఫికెట్లను జారీ చేశారు. రూ.లక్షలకు వాటిని అమ్ముకున్నారు. కీలకమైన రికార్డులు మాయమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీకి కొందరు నాయకులు, కొందరు రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇవన్నీ బయటపడ్డాయి. కానీ, ఏడాది అవుతున్నా చర్యలు మాత్రం నామమాత్రమే. దీంతో అక్రమాలు కొండంత, చర్యలు మాత్రం గోరంత అన్న చందంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీ కోసం టెక్కలి దరి జగతిమెట్ట సమీపంలో సర్వేనెం.288, 289లో సుమారు 12 ఎకరాల డీ.పట్టాను అధికారులు సేకరించారు. శ్యామసుందరాపురానికి చెందిన 40మంది రైతులకు చెందిన ఈ భూమిని ల్యాండ్ ఎక్విజేషన్ ద్వారా సేకరించారు. వీరికి నగదు చెల్లింపులు కూడా జరిగాయి. అలాగే, వీరికి ఒక్కో ఇంటి పట్టాను అందించాల్సి ఉంది. కానీ, అధికారులు మాత్రం 40మందికి బదులు 70 మంది రైతుల పేర్లు సృష్టించి వారికి పట్టాలు అందించారు. ఇళ్ల పట్టాల కేటాయింపుల్లో కొందరు రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శించి దొరికినకాడికి దోచుకున్నారు. అప్పటి అధికార పార్టీకి చెందిన కొందరి ప్రజాప్రతినిధుల సిఫారసులతో ఇష్టారాజ్యంగా ఇళ్ల పట్టాలు జారీచేయడం, పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయడం చేశారు. అప్పట్లో కొందరు వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు దళారీల అవతారం ఎత్తారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్ల పట్టాలను భారీ ధరలకు అమ్మకాలు చేశారు. ఈ కాలనీలో 389 లేఅవుట్లకు అనుతులు ఉంటే 420 వెలిశాయి. 150 వరకు భోగస్ పట్టాలు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణమే జగతిమెట్ట జగనన్న కాలనీలోని అక్రమాలను వెలికితీయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి ఆ బాధ్యతలను మంత్రి అప్పగించారు. దీంతో ఆర్డీవో విచారణ చేపట్టారు. తీగలాగితే డొంక కదిలినట్లయింది. భూములు ఇచ్చిన రైతులు 40మంది అయితే 70మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు గుర్తించారు. అలాగే 389 లేఅవుట్లకు బదులు 420 లేఅవుట్లు ఉన్నట్లు గుర్తించారు. 150 వరకు భోగస్ పట్టాలు ఉన్నట్లు తేల్చారు. ఈ లేఅవుట్లలో 70వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇక్కడ పొజిషన్ సర్టిఫికెట్లను రూ.లక్షలకు కొనుక్కొని ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిన వారు వందల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తుంది. కానీ, అధికారులు మాత్రం కేవలం 18 ఇళ్ల పునాదులను తొలగించి మమ అనిపించారు. అలాగే, 40 బోగసు పట్టాలు రద్దు చేసి చేతులు దులుపుకొన్నారు.

# గంజాయి ముఠా అరెస్టు

5 కిలోల సరుకు స్వాధీనం

ఒంగోలు(**టుడే విదుర**): గంజాయిని విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి ఒంగోలు పరిసరప్రాంతాలలో విక్రయిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 5 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నా మని చెప్పారు. ఈక్రమంలో సాయంత్రం స్థానిక సీతారామపురం కొండమీద గల రామాలయం వద్ద చినగజాంకు చెందిన కుక్కల గోవర్ధన్‌రెడ్డి, ఒడిశాకు చెందిన రాజేష్‌నాయక్, మహేశ్వర ముడి, ఒంగోలు బడ్లమిట్టకు చెందిన షేక్ ముజీర్‌ని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

# లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం




సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మార్కాపురం,(**టుడే విదుర**): ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ మార్కాపురం డివిజన్ పరిధిలో ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు 44, ప్రభుత్వ వైద్యశాలల్లో ఐదు ఉన్నాయన్నారు. డివిజన్ పరిధిలో ఆడ పిల్లల నిష్పత్తి తక్కువగా ఉందన్నారు. వెయ్యిమంది మగ పిల్లలకుగాను 981 మంది ఆడపిల్లలు ఉన్నారన్నారు. ఈ నిష్పత్తి అంతరాన్ని తగ్గించేందుకు వైద్యా?ధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.పద్మావతి, టౌన్ ఎస్సై డాక్టర్ ఎమ్.రాజమోహన్‌రావు,-ాక్టర్ శివారెడ్డి, మదర్సస్ ఇండియా సంస్థ సెక్రటరీ జీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

# యోగాతోనే పరిపూర్ణ ఆరోగ్యం: ఎమ్మెల్యే శంకర్



శ్రీకాకుళం (**టుడే విదుర**) : యోగాతోనే పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం లోని 80అడుగుల రోడ్డులో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఆయుష్ శాఖల ఆధ్వర్యంలో యోగ నిర్వహించారు. ఈసందర్భంగా గత ఏడాది పాలనలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే శంకర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి పి.జగదీష్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షకులు అమ్మన్నాయుడు, వి.సుధారాణి, కొరారి రేణుక, నంబాళ్ల కల్పన, రాంబాబు, దేశళ్ల సురేంద్ర, గోవిందరావు, ఆదినారాయణ, శేఖర్, తంగి స్వాతి, కొంక్యాన మురళి, దుంపల చిన్నబాబు పాల్గొన్నారు.

# పోలీస్ టెక్నికల్ టీంకు ప్రోత్సాహకాలు



అనంతపురం(**టుడే విదుర**): 25 మంది పోలీస్ ఐటి కోర్ టీం సిబ్బందికి ఎస్పీ పి.జగదీష్ నాడు ప్రోత్సాహక బహుమతి కింద స్మార్ట్ వాచ్‌లు అందజేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం జిల్లా పోలీసుశాఖ సుమారు 12 ఐటి అప్లికేషన్లు అమలు చేస్తోంది. వీటిలో సిసిటిఎన్ఎస్, మీ సేవ, స్మార్ట్ పోలీస్, ఐరాడ్, ఈ చలానా తదితర అప్లికేషన్లను వినియోగించడంలో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతిని అందించారు. ఇటీవల కానిస్టేబుళ్ల ఎంపికకు సంబంధించి అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలన, బయోమెట్రిక్ తీసుకోవడం తదితర వాటిని నిర్వహించిన

# వెంటనే ఫ్యాకల్టీని భర్తీ చేయాలి

☛ వైద్యుల హాజరు కూడా 70 శాతమే. ☛ మీ యాక్షన్ ప్లాన్ ఏమిటో చెప్పండి

☛ సమీక్షించిన తర్వాత తదుపరి నిర్ణయం



అమరావతి,**(టుడే విదుర):** కొత్త మెడికల్ కాలేజీల్లో సిబ్బంది కొరత లేకుండా చూడాలని, ఫ్యాకల్టీని వెంటనే భర్తీ చేయాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) రాష్ట్ర అధికారులను ఆదేశించింది. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీల్లో లోపాలను ఎన్ఎంసీ తీవ్రంగా పరిగణించింది. రెండేళ్లు గడువిచ్చినా ప్రభుత్వం కనీసం లోపాలు సరిదిద్దకపోవడంతో ఏపీ అధికారులకు ఘాటు లేఖ రాసింది. వెంటనే ఢిల్లీకి వచ్చి సమాధానం చెప్పాలని కోరింది. దీంతో రాష్ట్ర అధికారులు ఆగమేఘాల మీద ఢిల్లీకి పరుగులు తీశారు. ఎన్ఎంసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏపీ డీఎంఈ డాక్టర్ నరసింహం, ఆన్‌లైన్‌లో సెక్రటరీ డాక్టర్ మంజుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎంసీ అధికారులు 5 కాలేజీల్లోని లోపాలను రాష్ట్ర అధికారుల ముందుంచారు. 25 శాతానికిపైగా సిబ్బంది కొరత ఉందని, సిబ్బంది హాజరు కూడా 70-75 శాతం కూడా లేదని తెలిపింది. చాలామంది సెలవుల్లో ఉంటున్నారని, ఇలా అయితే అడ్మిషన్లకు అనుమతులివ్వడం కష్టమేనని హెచ్చరించింది. కాలేజీల్లోని లోపాలపై మీ యాక్షన్ ప్లాన్ ఏమిటని అధికారులను ప్రశ్నించింది. యాక్షన్ ప్లాన్ ఇస్తే దానిపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

# మళ్లీ పెరిగిన ఎండ

జంగమహేశ్వరపురంలో 40.1 డిగ్రీలు

నేడు అక్కడక్కడ ఈదురుగాలులతో వర్షాలు



విశాఖపట్నం, **(టుడే విదుర):** రాష్ట్రంపైకి నైరుతి వైపు నుంచి గాలులు వీచినా.. పలుచోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత పెరిగాయి. కోస్తాతోపాటు దానికి ఆనుకుని ఉన్న రాయలసీమ జిల్లాల్లో ఎండ ప్రభావం ఎక్కువగా ఉంది. జంగమహేశ్వరపురంలో 40.1, తిరుపతిలో 39.4, కావలిలో 38.8, నెల్లూరులో 38.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అక్కడక్కడ వర్షాలు కురిశాయి. కాగా, పశ్చిమబెంగాల్ పరిసరాల్లో ఉన్న అల్పపీడనం బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది వాయవ్యంగా పయనించనుంది. ఇంకా గుజరాత్ పరిసరాల్లో అల్పపీడనం స్థిరంగా ఉంది. వీటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు మధ్య, వాయువ్య, తూర్పుభారతంలో అనేక ప్రాంతాలకు విస్తరించాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, యూపీ, బిహార్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్ వరకూ విస్తరించనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని తెలిపింది.

# జగన్ రీసర్వే.. మాయాజాలం!

- ముదినేపల్లి మండలం పెయ్యేరు ప్రాథమిక పాఠశాల వద్దకు వచ్చిన తల్లికి వందనం అందుకోని విద్యార్థుల కుటుంబం
- తల్లికి వందనానికి శాపం
- సెంటు భూమి లేకున్నా భూస్వాములను చేసేశారు
- వ్యవసాయ కూలి పేరిట 118 ఎకరాలు.. వడ్రంగికి 46 ఎకరాలు
- గత ప్రభుత్వ హయాంలో విచిత్రాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



**(టుడే విదుర):** అధికారుల బాధ్యతారాహిత్యం.. గత వైసీపీ పాలకుల అలసత్వం వెరసి.. నిరుపేదల కుటుంబాలను ప్రభుత్వ పథకాలకు దూరం చేసింది. జగన్ సర్కార్ హయాంలో చేపట్టిన భూముల రీ సర్వే పేదల పాలిట శాపంగా మారింది. నిరుపేదలను భూస్వాములుగా చూపడంతో ప్రస్తుతం వారి పిల్లలు తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు. ఇప్పుడు వీరంతా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మండవల్లి/ముదినేపల్లి, గత వైసీపీ ప్రభుత్వం రైతుల భూముల రీసర్వేకు నిర్ణయించి హైదరాబాద్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా సంస్థకు కాంట్రాక్టు ఇచ్చింది. ఆ సంస్థ సిబ్బంది డ్రోన్ల ద్వారా భూమి సర్వే చేసి రికార్డుల్లో రైతుల భూవివరాలు నమోదు చేశారు. డ్రోన్ సర్వే అనంతరం సర్వేచేసిన భూమి మీద వాస్తవ పరిస్థితులు, ఎవరి ఆధీనంలో ఉంది ? ఎవరు భూ యజమానులు, ఎవరు హక్కుదారులు ? అని నిర్ధారించు కోవాల్సి ఉంది. గ్రామసభ ద్వారా ఆ భూముల వివరాలు రైతులకు యజమానులకు తెలిపి ఫారం 54 ద్వారా యజమానుల నుంచి ఒప్పంద పత్రం తీసుకోవాలి. అధికారులు అవేవి చేయకుండా నిరుపేదల జీవితాలతో చెలగాటమాడారు.మండవల్లికి చెందిన షేక్ బాజీ తన తాత, తల్లిదండ్రుల కాలం నుంచి పంట కాలువ పక్కన ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో చిన్న తాటాకిల్లు వేసుకొని కూలి పనులు, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ పనికి వెళ్లందే ఇంట్లో పొయ్యి వెలగని పరిస్థితి కుటుంబానిది. కానీ సర్వే నంబర్ 948లో 118 ఎకరాలు ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపడంతో అతను అవాక్కయ్యాడు. తన కుమార్తె షేక్ నాజీయా చదువుకు ఆటంకం కలగకుండా చూడాలని ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నాడు.ఎండవల్లికి చెందిన వల్లూరి ప్రసాద్ వడ్రంగి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనితో పాటు తమ్ముడి కుటుంబం చిన్నపాటి రేకుల షెడ్డులో ఉంటున్నారు. అతని కుమారుడు నాగరంగ వెంకట సత్యప్రసాద్‌కు 'తల్లికి వందనం' సొమ్ము జమ కాకపోవడంతో కారణం తెలుసుకునేందుకు సచివాలయానికి వెళ్లగా 'నీ పేరిట 46 ఎకరాలు ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపుతోంది' అని సిబ్బంది తెలపడంతో ఖంగుతిన్నాడు. జన్ను శివనాగ రాజు వ్యవ సాయ పనులు చేసుకుంటూ పంటకాల్వ పక్కన ఇరిగేషన్ స్థలంలో షెడ్డు వేసుకుని జీవిస్తున్నాడు. అతనికి 47 ఎకరాలు ఉన్న ట్టు చూపడంతో కుమార్తె జస్వంత్ సాహితి తల్లికి వందనం పథకానికి అనర్హులిగా తేలింది. మండవల్లిలోని కైకలూరు సందులో నివాసం ఉన్న శాయన కృష్ణ సురేష్‌కు 20 సెంట్లు భూమి ఉండగా 17 ఎకరాలు ఉన్నట్టు రికార్డులో నమోదు అయ్యింది. దీంతో అతని కుమారుడు నిఖిలేశ్వరకార్తీక్‌ను అనర్హుడిగా ప్రకటించారు.

# వాటర్‌షెడ్ పనుల పరిశీలన

**వివరాలను పరిశీలిస్తున్న నాబార్డు అధికారులు**



గడివేముల, **(టుడే విదుర):** మండలంలోని గని గ్రామంలో నాబార్డ్, జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ఆర్థిక సహకారంతో చేసిన వాటర్‌షెడ్ పనులను నాబార్డ్ డీడీఎం కార్తీక్ పరిశీలించారు. అనంతరం కమిటీ సభ్యులు, రైతులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వాటర్‌షెడ్ ద్వార భూగర్భజలాలు పెరుగుతాయని అన్నారు. భూ సంరక్షణ పనులు చేపట్టడం వల్ల భూమి కోతను నివారించవచ్చని అన్నారు. నవ యువత అసోసియేషన్ డైరెక్టర్ నరసింహులు, ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మీనారాయణ, ఇంజనీర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్టు అభివృద్ధికి రూ.8.033 కోట్లు : మంత్రి బీసీ



బనగాన పల్లె, **(టుడే విదుర):** కర్నూలు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం రూ. 8.033 కోట్లకు అనుమతి లభించిందని రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక వనరుల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు ఎయిర్‌పోర్టులో 2 అభివృద్ధి పనులకు 2025-26 సంవత్సరానికి విమానాశ్రయం కార్యకలాపాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. రన్‌వేస్ ఆండ్ సేఫ్టీని సరిదిద్దడానికి ఇతర నిర్వహణ పనులకు రూ.3.6 కోట్లు, కర్నూలు ఎయిర్‌పోర్టులో టాక్సీవేటు ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ అందించడానికి రూ.4.433 కోట్లకు అనుమతి లభించాయన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

# మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



సుండుపల్లె,**(టుడే విదుర):** మూడు నెలలకు ఒక్కసారి ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరుగుతోంది. వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి స్థానిక ఎన్నికలు పూర్తి అయిన తర్వాత జరిగిన సర్వసభ్య సమావేశం నుంచి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సర్వసభ్య సమావేశంలో సమస్యలు పరిష్కరించిన పాపాన పోలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు ఉదయం 10 గంటలకు సభకు హాజరు కావాల్సి ఉండగా మధ్యాహ్నం 12 గంటలకు హాజరయ్యారు. గత సమావేశంలో వివరించిన ఏ సమస్యకు పరిష్కారం చూపినట్లు ప్రస్తావించలేదు. పైగా కీలక పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారులు ఎవరూ సమావేశానికి హాజరు కాలేదు. మండల వ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలు ఉన్నాయి. ఆ శాఖకు సంబంధించిన అధికారులు హాజరుకాకపోవడం ఏమిటని ఎంపీపీ రాజమ్మ ప్రశ్నించారు. అంతేగాకుండా ఎంపీటీసీలు కూడా గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా చేసుకున్న వారు కావడంతో ప్రజా సమస్యలు ఉంటే మాకేంటి అనే ధోరణిలో వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. చిన్నగొల్లపల్లి సర్పంచ మినహా సర్పంచులు ఎవరూ సమావేశానికి హాజరు కా లేదు. గత ప్రభుత్వంలో సమావేశాలు నిర్వహించారు కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న నిధులు ఏం చేశారో లెక్కలు చెప్పలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి.

# బీటెక్ ఫలితాలు విడుదల



**(టుడే విదుర):** అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్, మే నెలలలో నిర్వహించిన బీటెక్ ఫలితాలు విడుదల అయ్యాయి. బీటెక్ నాలుగవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్20, 19, 15) సప్లిమెంటరీ, బీఫార్మసీ ఒకటవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్ 23, 19, 15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య వి.నాగ ప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎపి.శివ కుమార్, అడిషినల్ కంట్రోలర్స్ ఆచార్య జి.శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎం.అంకారావు వీటిని విడుదల చేశారు.

# రైతులే ధర నిర్ణయించేలా ఎదగాలి

రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి

964 మంది రైతులకు రూ.1.99 కోట్ల రాయితీ

%వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేసిన కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, **(టుడే విదుర)** : పండించిన పంటకు ధర నిర్ణయించే స్థాయికి రైతులు ఎదగాలని నంద్యాల కలెక్టర్ రాజకుమారి ఆకాంక్షించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద జిల్లాలో 964మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.1.99 కోట్ల వ్యవసాయ పరికరాల రాయితీని ప్రభుత్వం విడుదల చేసినట్లు ఆమె పేర్కొన్నారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో వ్యవసాయ యాంత్రీకరణ సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెషనైజేషన్ పథకం కింద వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లాలోని సహాయ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు. రైతులకు విడుదల చేసిన రూ.1.99కోట్ల రాయితీ నిధుల చెక్కును కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు.



# కొల్లేరుపై సమగ్ర సమాచారమివ్వండి

## అధికారులకు సాధికార కమిటీ ఆదేశం

## ముగిసిన రెండ్రోజుల పర్యటన



ఏలూరు, **(టుడే విదుర):** 'కొల్లేరుపై సమగ్ర సమాచారాన్ని మాకు అందించండి. కొల్లేరు అభయారణ్యం పరిధిలో రోడ్ల నిర్మాణం, నిర్వహణ, ఏలూరు పారిశుధ్య వ్యర్థాలు, శుద్ధీకరణ సామర్థ్యం, సరస్సు పరిధిలో చేపల పెంపకానికి వినియోగించే రసాయన ఎరువులు, పురుగు మందుల వివరాలు మాకివ్వండి. ఏ ఒక్క అంశాన్ని వదలకండి. మేము కోరిన సమాచారం త్వరితగతిన అందేలా చూడండి' అని జిల్లా యంత్రాంగానికి కేంద్ర సా?ధికార కమిటీ ఈ ఆదేశాలిచ్చింది. కొల్లేరు కాలుష్యం, ఇతర అంశాలపై కూడా క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక సమర్పించాల్సిందిగా మత్స్యశాఖ అధికారులను ఆదేశించింది. కొల్లేరులో వాస్తవ పరిస్థితులను పరిశీలించి మూడు నెలల్లోపు సమగ్ర నివేదిక సమర్పించేందుకు వీలుగా కేంద్ర సాధికార కమిటీ ఏలూరు జిల్లాలో రెండ్రోజుల పర్యటన ముగిసింది.

# ఎస్సీలకు పదోన్నతిలోనూ వర్గీకరణ అమలు

అమరావతి, **(టుడే విదుర):** ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో అమలు చేసేందుకు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల నిబంధనలు, 2025 నోటిఫికేషన్ విడుదల చేస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 18న ఉత్తర్వులు జారీచేసింది. తాజాగా ఈ నిబంధనలను సవరిస్తూ ఎస్సీలకు పదోన్నతుల్లోనూ వర్గీకరణ అమలు చేయాలని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. జీఓ నెం.7లోని రూల్-8 తర్వాత 8(ఏ) కింద ఎస్సీల మూడు గ్రూపులకు పదోన్నతిలో రిజర్వేషన్ అమలు తీరును జీఓ నెం.19లో పేర్కొన్నారు. గ్రూప్-1లో 12 కులాలకు పదోన్నతులకు 1 శాతం రిజర్వేషన్ అమలు చేస్తారు. అదే విధంగా గ్రూప్-2 లోని 18 కులాలకు 6.5 శాతం రిజర్వేషన్, గ్రూప్-3లో 29 కులాలకు 7.5 శాతం రిజర్వేషన్ పదోన్నతుల్లో అందించనున్నారు. కేడర్ స్ట్రెంత్ 5 కంటే ఎక్కువగా ఉద్యోగులు ఉన్న చోట పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తారు. పదోన్నతులకు సంబంధించి 2024-25 ప్యానెల్ ఏప్రిల్ 18, 2025కు ముందుగా సిద్ధమైనా, కాకపోయినా దానిని తిరిగి సమీక్షించవచ్చు. 2024-25 ప్యానెల్ ఏప్రిల్ 18, 2025కు ముందు సిద్ధమై... పాక్షికంగా లేక పూర్తిగా అమలు చేసి ఉంటే అది అలాగే కొనసాగిస్తారు. మహిళలకు దక్కాల్సిన 33.33 శాతం రిజర్వేషన్లు ఆయా గ్రూపులు మూడింటికి సమాంతరంగా పదోన్నతుల్లోనూ అమలు చేస్తారు. అంటే ప్రతి గ్రూపులో ఆయా మహిళలకు 33.33 శాతం పదోన్నతుల్లోనూ దక్కేలా చూస్తారు. ఏదైనా ఒక ప్యానెల్‌కు, ఓ గ్రూప్‌నకు సంబంధించిన అర్హులైన అభ్యర్థులు లేకపోతే ఆ ఖాళీని అదే గ్రూపునకు తదుపరి ప్యానెల్‌లో అవకాశమిస్తారు. రెండో ప్యానెల్‌లో కూడా ఆయా గ్రూప్‌నకు సంబంధించిన అర్హులైన అభ్యర్థులు భర్తీ కాకపోతే, మూడో ప్యానెల్‌లో తదుపరి గ్రూపునకు అవకాశం కల్పిస్తారు.

# సముద్రంపై తిరుగులేని శక్తిగా భారత్

## స్వదేశీ పరిజ్ఞానంతో 98 నౌకలు తయారీ

## 'అర్నాల' ప్రారంభోత్సవంలో డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్



విశాఖపట్నం, **(టుడే విదుర):** నిన్న మొన్నటి వరకు ఇతర దేశాల నుంచి ఆయుధాలు కొనుగోలు చేసిన భారత్ ఇప్పుడు వాటిని తయారుచేసే స్థాయికి ఎదిగిందని, సముద్రంపై తిరుగులేని శక్తిగా మారిందని డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. కోల్‌కతా గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ తయారు చేసిన యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్-షాలో వాటర్ క్రాఫ్ట్ ఐఎన్ఎస్ 'అర్నాల'ను విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్‌లో ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ ఇప్పటివరకూ స్వదేశీ పరిజ్ఞానంతో 98 యుద్ధ నౌకలు తయారు చేసిందని, అందులో విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్, న్యూక్లియర్ సబ్‌మెరైన్లు, ఫ్రిగేట్లు, కార్వెట్లు, డెస్ట్రాయర్లు, సర్వే నౌకలు ఉన్నాయని చెప్పారు. ఇవి కాకుండా మరో 60 నౌకలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని, మరో 180 నౌకల నిర్మాణానికి ఒప్పందాలు తయారవుతున్నాయన్నారు. కొత్తగా నౌకాదళంలో చేరిన 'అర్నాల'కు పెద్ద సవాళ్లను స్వీకరించగల సత్తా ఉందని, భారత తీర ప్రాంత రక్షణలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్, వార్‌షిప్ ప్రొడక్షన్ అండ్ ఎక్విజిషన్ కంట్రోలర్ వైస్ అడ్మిరల్ రాజారామ్ స్వామినాథన్, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్ అండ్ ఇంజనీర్స్ సీఎండీ కమొడోర్ పి.హరి తదితరులు పాల్గొన్నారు.

# యోగాంధ్రాకు 175 దేశాల ప్రతినిధులు

## విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా



విశాఖపట్నం, అమరావతి, **(టుడే విదుర):** విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పాటు 175 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. విశాఖ నుంచి భీమిలి వరకూ 29.8 కి.మీ. పొడవున కార్యక్రమం నిర్వహిస్తామని, ఒక్క బీచ్ రోడ్డులోనే 3.26 లక్షల మంది పాల్గొంటారని చెప్పారు. ఇంకా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పాల్గొనే వారితో కలిపితే మొత్తం ఐదు లక్షల మంది అవుతారన్నారు.మరో నలుగురు ఐఏఎసలకు బాధ్యతలు 'యోగాంధ్ర' కార్యక్రమానికి మరో నలుగురు ఐఏఎసలను నియమిస్తూ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. యోగాంధ్రకు ప్రజలను సమీకరించేందుకు ఇప్పటికే సీనియర్ ఐఏఎస్ అధికారి డా. మల్లికార్జునను ప్రభుత్వం నియమించింది. ఆయనకు మద్దతుగా ఐఏఎసలు ఎస్.రామసుందర్ రెడ్డి, రోణంకి కూర్మనాథ్, ఆర్.గోవిందరావు, ప్రకాశం జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణను నియమించింది.

# తప్పుడు ప్రచారంతో వైసీపీ విషం



పత్తికొండ, **(టుడే విదుర):** టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకంపై వైసీపీ తప్పుడు ప్రచారాంతో విషం కక్కుతోందని ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పరిశీలకుడు ఆదినారాయణతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఇచ్చినమాట నిలుపుకున్న సీఎం చంద్రబా బుకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లులు కృతజ్ఞతలు తెలుపుతున్నారని ప్రజల్లో ప్రభుత్వానికి ఆదరణ పెరగడాన్ని చూసి ఓర్వలేని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. రూ.15వేలు ఇస్తామని రూ.13వేలు మాత్రమా ఇచ్చారని మిగిలిన రూ.2వేలు ఏమయ్యాయని ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులకు తమ పాలనలో రూ.2వేలు జగన్ జేబులోకి పోయాయా లేక తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా అన్నది చెప్పాలన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్ భారతి ప్రతిఇంటిలో ఇద్దరు పిల్లలకు విద్యాదీవెన ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క విద్యార్థికే అమలు చేయడం ఎంటి అని ప్రశ్నించారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని ప్రగల్భాలు పలికి 12 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల జీవితాలు నాశనం చేసింది వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. సభ్యులు జీవాలు నాయక్, వెంకటేశ్వర్లు యాదవ్, మనోహర్‌చౌదరి, వెంకటపతి, తిరుపాల్‌నాయుడు, నరసింహదరి పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల ఆమోదంతోనే నూతన కమిటీలు ఏర్పాటుచేస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకులతో సమావేశం నిర్వహించారు.

# ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

## స్వాధీనం చేసుకున్న బైకులను పరిశీలిస్తున్న ఎస్పీ

## 30 వాహనాలు స్వాధీనం



గోనెగండ్ల/కర్నూలు,**(టుడే విదుర):**గత ఏడాదిగా పోలీసులుకు కంటిమీద కునుకు లేకుండా చేసిన ద్విచక్ర వాహనాల దొంగను ఎట్టకేలకు గోనెగండ్ల పోలీసులు అరెస్టు చేశారు. దొంగ దగ్గర నుంచి రూ. 35 లక్షల విలువ చేసే 30 ద్విచక్రవాహనా లను స్వాధీనం చేసుకున్నారు. గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన బజారి కుమారుడు వెంకటేశ్ కూలి పనులు చేసి జీవించేవాడు. విలాసాలు, మద్యానికి బానిసై సులువుగా డబ్బు సంపాదిం చాలనుకొని మొదట్లో చిన్న చిన్న దొంగతనాలకు అలవాటు పడ్డాడు. తర్వాత బస్టాండ్‌లో, ఇండ్ల ముందు, హోటళ్ల ముందు నిలిపిన ద్విచక్రవాహ నాలను దొంగతనం చేయడం మొదలు పెట్టాడు. కర్నూలు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, దేవనకొండ, కోడుమూరు, ఓర్వకల్లు తదితర ప్రాంతాలలో ద్విచక్రవాహనాలను దొంగలించాడు. ఎస్పీ ఆదేశాలతో గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ తన బృందంతో విచారణ చేపట్టారు.

# బోర్డులతో బోల్తా కొట్టించారు..ఉన్నవి లేనట్లు.. లేనివి ఉన్నట్లు

## అధికారుల తనిఖీకి ముందు నర్సింగ్ కళాశాల బోర్డుతనిఖీ అనంతరం విశ్వనారాయణ కళాశాలగా మార్పు



ఆదోని అగ్రికల్చర్,**(టుడే విదుర):** బోర్డులు మార్చి క్షణాల్లో అధికారులను బోల్తా కొట్టించారు. సినీ ఫక్కీలో అప్పటికప్పుడు అన్ని సర్దుబాటు చేశారు. తనిఖీల కోసం వచ్చిన అధికారులు వారి మాట వినేలా చేశారు. మీడియా ప్రతినిధులను తప్పుదోవ పట్టించారు. అధికారులు రాలేదంటూ అబద్ధాలు పలికారు.. శంకర్ దాదా ఎంబీబీఎస్ తరహాలో సాగిన ఈఘటన ఆదోనిలో చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల రహదారిలో వెంకటేశ్వర జూనియర్ కళాశాల పక్కన ఆర్ఎస్ నర్సింగ్ స్కూల్‌ను మూడేళ్ల కిందట ఏర్పాటుచేశారు. ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఆర్ఎస్ నర్సింగ్ స్కూల్ అంటూ బోర్డు పెట్టేశారు. ఇంటర్ పూర్తయిన వారికి జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫైరీ (జీఎన్ఎమ్) మూడున్నరేళ్ల కోర్సుకు ప్రవేశాలు జరుపుకున్నారు. మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా జీఎన్ఎమ్ తరగతులు నిర్వహిస్తున్నారు. కర్నూలు కళాశాలకున్న అనుమతులతో సర్టిఫికెట్లను వారికి అందజేస్తున్నట్లు తెలుస్తుంది. ఆదోనిలో ఆర్ఎస్ నర్సింగ్ స్కూల్ ఉందని ఇటీవల అనుమతుల కోసం ప్రభుత్వా నికి దరఖాస్తు చేసుకున్నారు. వైద్యారోగ్య శాఖ విజయవాడ డీఎంఈ రిజిస్టర్ కార్యాలయం నుంచి తనిఖీల కోసం అధికారులు వచ్చారు. ముందుగానే ఆర్ఎస్ నర్సింగ్ స్కూల్ ఆఫ్ కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇవ్వడంతో అప్పటికప్పుడే అదే ఏరియాలో వెనుక రోడ్డులో ఉన్న విశ్వనారాయణ ఒకేషనల్ జూనియర్ కళాశాలను అదే అంటూ చూపించే ప్రయత్నించారు.

# టుడే వినోదం

## మాట తీసుకున్నాడు.. మరోసారి చేయబోతున్నాడట..



పవన్ కల్యాణ్ 'హరి హర వీరమల్లు' సినిమా చిత్రీకరణ పూర్తి చేశారు. 'ఓజీ'కీ కూడా కాల్షీటు ఇచ్చారు. త్వరలోనే ఆ చిత్రం కూడా పూర్తికానుందని మేకర్స్ వెల్లడించారు. ఇంకో వైపు హరీశ్ శంకర్ కూడా 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ షురూ చేశారు. ఈసినిమా సెట్‌లోనూ పవన్ పాల్గొంటున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం పవన్ కొత్త కథలు వింటున్నట్లు టాక్ నడుస్తోంది. ఆయనతో 'బ్రో' చిత్రం తీసిన తమిళ దర్శకుడు, నటుడు సముద్రఖని పవన్‌తో మరో సినిమా చేయాలనుందని ఎప్పటి నుంచో చెబుతున్నారు. అయితే ఇటీవల సముద్రఖని పవన్‌కు ఓ కథ చెప్పారట. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో 'బ్రో' సినిమా వచ్చింది. పవన్ ఫ్యాన్స్‌ను మెప్పించిన సినిమా అది. అప్పట్లోనే పవన్ సముద్రఖనితో ఓ సినిమా చేస్తానని మాటిచ్చారట. ఇప్పుడు అది పట్టాలెక్కబోతోందని తెలిసింది. పవన్‌కు ఇప్పటికే కొంతమంది నిర్మాతలు అడ్వాన్స్ ఇచ్చారు. ఆయన పార్టీ పనులతో బిజీ కావడం, సినిమాలకు కొంత గ్యాప్ ఇవ్వంతో కొందరికి అడ్వాన్స్‌లు తిరిగి ఇచ్చేశారు. అందులో కొంత మందికి ఇవ్వాల్సి ఉంది. వారిలో ఓ నిర్మాత కోసం ఇప్పుడీ సినిమా చేయబోతున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. తక్కువ సమయంలో, లిమిటెడ్ బడ్జెట్ లో ఈ సినిమా ప్లాన్ చేశారట. ఇటీవల సముద్రఖని పవన్‌ని కలిసి కథ చెప్పేసినట్టు ఇన్ సైడ్ వర్గాల టాక్. ఉస్తాద్ భగత్ సింగ్ పూర్తయిన తర్వాత ఈ చిత్రం ఉండబోతోందని సమాచారం.



## మహేశ్ సినిమా... ఎంతైనా తగ్గేదేలే..




బాలీవుడ్‌లో భారీ కాన్వాస్ కథలు, సెట్లు, కళాత్మక పంథాలో చిత్రాలను తెరకెక్కించడం అంటే గుర్తొచ్చే పేరు సంజయ్ లీలా భన్సాలీ దేవదాస్ సినిమా కోసం ఏకంగా 50 కోట్ల బడ్జెట్‌తో భారీ సెట్ నిర్మించారని అప్పట్లో గొప్పగా చెప్పుకున్నారు. అది తెరపై కనిపించింది. ఆయన తీసే సినిమా బడ్జెట్‌లో 15 నుంచి 35 కోట్లు సెట్స్ కోసం ఖర్చవుతుంది. బాజీరావు మస్తానీ, ప్రేమ్ రతన్ ధన్ సాయో, రామ్ లీలా, హీరామండి ఇవన్నీ ఆ కోవకు చెందినవే. అలాగే టాలీవుడ్ అలా భారీ సెట్స్ వేసే అలవాటు దర్శకుడు గుణశేఖర్‌కు ఉంది. ఎందుకంటే ఆయన ఎంచుకునే కథల స్పాన్ అలా ఉంటుంది. ఒక్కడు, వరుడు సహా చాలా సినిమాలకు గుణశేఖర్ భారీతనంతో నిండిన సెట్స్‌కు కోట్లు ఖర్చు చేశారు. రుద్రమదేవి లాంటి సినిమా కోసం పూర్తి స్థాయి బడ్జెట్ లభించకపోవడంతో ఆ సినిమా అవుట్‌పుట్ కాస్త డల్‌గా వచ్చింది. ఆయన తర్వాత అలా భారీతనంతో సెట్స్ వేయడంలో రాజమౌళి ఘనాపాటి. అయితే ఆయనకు ఆర్థిక వనరుల దృష్ట్యా ఎలాంటి సమస్య లేదు. బెస్ట్ అవుట్‌పుట్ కోసం ఆయన ఎంత ఖర్చు చేయడానికైనా వెనకాడరు. ఇప్పుడు మహేశ్ సినిమా కోసం భారీ సెట్స్ నిర్మిస్తున్నారని తెలిసింది. ప్రస్తుతం ఆయన మహేష్ కథానాయకుడిగా ఎస్ఎస్ఎంబీ 29 తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే! ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో వారణాసిలో కీలక షెడ్యూల్ చేయాలట. నిజానికి గంగానది ఒడ్డున రియల్ లొకేషన్లలో ఇలాంటి భారీ చిత్రాన్ని తెరకెక్కించాలంటే సవాల్‌తో కూడిన విషయమే! పోలీసుల నుంచి అనుమతులు పొందడం అంత సులువు కాదు. దాంతోపాటు ప్రజలు, ప్రజల నుంచి చాలా ఇబ్బందులు తలెత్తుతాయి. అది కష్టంతో కూడిన పని కావడంతో రాజమౌళి వారణాసిని తలపించే భారీ సెట్‌ని నిర్మించాలని ప్లాన్ చేసినట్టు తెలిసింది. వారణాసిలో దేవాలయాలు, ఘాట్‌లతో ఆధ్యాత్మికత నిండిన ప్రాంతంగా ఉంటుంది. అలాంటి నగరాన్ని నిర్మించాలనే ఆలోచన సవాళ్లతో కూడుకున్నదే! తెరపై ఒరిజినాలిటీ చూపించాలి. దాని కోసం రాజమౌళి టీమ్, ఆర్ట్ డైరెక్టర్‌తో కసరత్తులు చేస్తున్నారని తెలిసింది.

## ఓటీటీలో మాధవన్ మూవీ ఎప్పటి నుండంటే...




ప్రముఖ నటుడు మాధవన్ కు గతంలో రొమాంటిక్ హీరో ఇమేజ్ ఉండేది. కానీ కొంతకాలంగా అందుకు భిన్నమైన పాత్రలను చేస్తున్నాడు. కొన్ని హిందీ సినిమాలలో ప్రతినాయకుడి పాత్రలు చేయడానికి కూడా మాధవన్ వెనుకాడలేదు. తెలుగులో ఆ మధ్య వచ్చిన అనుష్క 'నిశ్శబ్దం' లో అలాంటి భిన్నమైన పాత్రనే మాధవన్ చేశాడు. సైంటిస్ట్ నంబి నారాయణన్ బయోపిక్ 'రాకెట్రీ' తో మాధవన్ దర్శకుడిగానూ మారిపోయాడు. ఆ బయోపిక్ అతనికి నటుడిగా, దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. అలానే గత యేడాది మాధవన్ నటించిన 'సైతాన్' కూడా కమర్షియల్ హిట్ అయ్యి, మాధవన్ లోని నటుడిని వెలికి తీసింది. ఈ యేడాది ఇప్పటికే మాధవన్ నటించిన 'హిసాబ్ బరాబర్,' 'టెస్ట్' చిత్రాలు వచ్చాయి. అయితే ఈ రెండు కూడా ఓటీటీలోనే విడుదల కావడం విశేషం. ఇక అక్షయ్ కుమార్ తో కలిసి మాధవన్ నటించిన కోర్ట్ డ్రామా 'కేసరి చాప్టర్ 2' థియేటర్లలో సందడి చేసింది.

## ఇంతకంటే నేను కోరుకునేదేమి లేదు



'దర్శకుడిగా నా 25 ఏళ్ల ప్రయాణాన్ని తరచి చూసుకున్నప్పుడు ఉద్వేగానికి లోనయ్యా. ఒక చిన్న ఇంట్లో తొలి సినిమా తీసిన నేను ఇప్పుడు 'కుబేర' లాంటి పెద్ద సినిమా తీయగలిగాను. ప్రేక్షకులు నాకు చాలా ప్రేమని ఇచ్చారు. వారు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే నాకు చాలా ఆనందాన్నిచ్చే విషయం. నా సినిమాలను ఆదరించిన ప్రేక్షకులు దర్శకుడిగా నాకంటూ ఒక స్థాయిని ఇచ్చారు. ఈ జీవితంలో ఇంతకంటే నేను కోరుకునేదేం లేదు' అని శేఖర్ కమ్ముల అన్నారు. ధనుష్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మీడియాతో ముచ్చటించారు. %బిలియనీర్ వర్సెస్ బెగ్గర్... అనే లైన్ ఆసక్తికరంగా అనిపించి కథగా మలిచాను. ధనవంతులు, పేదల మధ్య జరిగే కథ ఇది. రెండు ప్రపంచాల మధ్య సంఘర్షణలా ఉంటుంది. కథను సిద్ధం చేసే క్రమంలో అదొక ఎమోషనల్ థ్రిల్లర్‌గా రూపొందింది. జీవితంలో ఇక తనకు ఏమీ వద్దు అనుకునే బిచ్చగాడు, ప్రపంచంలో అన్నీ తన సొంతం కావాలని కోరుకునే బిలియనీర్ మధ్య పోరాటం ఆసక్తికరంగా ఉంటుంది.

## చిరంజీవి పాటకు భీమ్స్ ట్యూన్




మొదటి నుంచీ ప్రతిభ ఎక్కడ ఉన్నా ప్రోత్సహిస్తూ సాగుతున్నారు చిరంజీవి... ఆయన రీ ఎంట్రీ తరువాత 'ఖైదీ నంబర్ 150', 'వాల్తేరు వీరయ్య' మినహాయిస్తే మిగిలిన నాలుగు సినిమాలు అంతగా అలరించలేకపోయాయి... 'భోళాశంకర్' పరాజయం చిరంజీవి ఫ్యాన్స్ కు నిరాశ కలిగించింది... దాంతో 'విశ్వంభర' ద్వారా అభిమానులకు ఆనందం పంచే దిశగా సాగుతున్నారు చిరంజీవి.%యంగ్ టాలెంట్ ను ఎంకరేజ్ చేసే చిరంజీవి ఈ సినిమాలో డైరెక్టర్ మల్లిడి వశిష్ఠకు ఛాన్స్ ఇచ్చారు... అతను కూడా శక్తివంచన లేకుండా 'విశ్వంభర'ను రూపొందించారు... ఓ పాట మినహా 'విశ్వంభర' పూర్తయింది... ఈ సాంగ్ ఐటమ్ నంబర్ గా రూపొందనుంది... ఇందులో చిరంజీవితో చిందేసే ముద్దుగుమ్మ కోసం అన్వేషణ సాగుతోంది... ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడు... ఆయన 'హరిహర వీరమల్లు' సినిమా రీ-రికార్డింగ్ లో బిజీగా ఉన్నారు... అందువల్ల ఈ ఐటమ్ నంబర్ కు మాత్రం భీమ్స్ సిసిరోలియో ట్యూన్స్ ఎంచుకున్నారట... ఈ యేడాది బంపర్ హిట్ గా నిలచిన 'సంక్రాంతికి వస్తున్నాం'కు భీమ్స్ సిసిరోలియో ట్యూన్స్ భలేగా పనిచేశాయి... ఈ చిత్రంలోని పాటలు మాస్, క్లాస్ అన్న తేడాలేకుండా అందరినీ ఆకట్టుకుంటున్నాయి... చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి రూపొందిస్తున్న చిత్రానికి కూడా భీమ్స్ స్వరకల్పన చేస్తున్నారు... ఈ నేపథ్యంలోనే 'విశ్వంభర' చిత్రంలోని ఐటమ్ నంబర్ కు భీమ్స్ బాణీలు ఉపయోగించుకోవాలని చిరంజీవి, దర్శకుడు వశిష్ఠ నిర్ణయించారు... చిరంజీవి సినిమాలో ఐటమ్ నంబర్ అంటే ఇరగదీసేలా ఉండాలని అభిమానులు ఆశిస్తున్నారు... మరి వారి అంచనాలకు తగ్గట్టుగానే భీమ్స్ బాణీలు ఉంటాయని టాక్!

## ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే చిత్రమిది




అనంతిక సునీల్‌కుమార్ లీడ్‌రోల్ పోషించిన చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించారు. ఈనెల 20న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ఇటీవలే ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించింది. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ 'సినిమా విజువల్‌గా చాలా బాగుంది. ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యే చిత్రమిది. ఒక అమ్మాయి జీవిత ప్రయాణమే '8 వసంతాలు' సినిమాగా మీ ముందుకొస్తోంది. తప్పకుండా మీకు నచ్చుతుంది' అన్నారు. 'ఇది చాలా డిఫరెంట్ మూవీ. కథ బాగా నచ్చి మేము చేసిన ఈ ప్రయత్నం మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని నవీన్ యెర్నేని అన్నారు. ఫణీంద్ర నర్సెట్టి మాట్లాడుతూ 'మా నిర్మాతలు ఒక మంచి కథతో వస్తే సినిమా తీస్తారు అనే దానికి మా '8 వసంతాలు' చిత్రం ఓ నిదర్శనం. ఈ సినిమాతో ఒక మంచి చిత్రాన్ని నిర్మించారనే పేరు వారికి వస్తుంది. అనంతిక నటన ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ' అని అన్నారు. అనంతిక మాట్లాడుతూ 'మైత్రీ లాంటి పెద్ద నిర్మాణ సంస్థలో సినిమా చేసినందుకు ఆనందంగా ఉంది. ఫణీంద్ర గారి వల్ల ఈ సినిమాలో ఒక బలమైన పాత్రను చేశాను. ఇది నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం' అన్నారు.

టుడే స్పోర్ట్స్

## క్విటోవాకు వింబుల్డన్ వైల్డ్‌కార్డ్



లండన్: రెండుసార్లు వింబుల్డన్ చాంపియన్ పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్)కు ఆ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వైల్డ్‌కార్డ్ లభించింది. దీంతో ఈనెల 30 నుంచి జరిగే వింబుల్డన్‌లో క్విటోవా నేరుగా మెయిన్ డ్రాలో తలపడనుంది. ఏడాదిన్నరపాటు ఆటకు దూరంగా ఉన్న ఆమె.. ప్రస్తుతం 572వ ర్యాంక్‌లో ఉంది.

# గిల్ సేన సాధించేనా




టెస్టుల్లో భారత్, ఇంగ్లండ్ పోరు దశాబ్దాలనాటిది. 1932 నుంచి ఇంగ్లండ్‌లో టీమిండియా పర్యటిస్తున్నా సిరీస్ గెలిచిన సందర్భం ఒక్కటే..! అంటే పర్యాటక జట్టుకు ఎంత కష్టమో రికార్డులను చూస్తేనే.. టెస్టుల్లో భారత్, ఇంగ్లండ్ పోరు దశాబ్దాలనాటిది. 1932 నుంచి ఇంగ్లండ్‌లో టీమిండియా పర్యటిస్తున్నా సిరీస్ గెలిచిన సందర్భం ఒక్కటే..! అంటే పర్యాటక జట్టుకు ఎంత కష్టమో రికార్డులను చూస్తేనే అర్థమవుతోంది. 2007లో రాహుల్ ద్రవిడ్ సారథ్యంలో మూడు టెస్టుల సిరీసను భారత్ 1-0తో దక్కించుకుంది. నాటింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో జహీర్ ఖాన్ నిప్పులు చెరగగా.. సచిన్, గంగూలీ, లక్ష్మణ్ బ్యాట్‌తో చెలరేగడంతో భారత్ 7 వికెట్ల తేడాతో నెగ్గింది. లార్డ్స్, ఓవల్‌లో జరిగిన మ్యాచ్‌లను టీమిండియా డ్రాగా ముగించింది. ఆ తర్వాత రోహిత్ శర్మ, కోహ్లి, అశ్విన్, బుమ్రాలతో భారత్ మేటి జట్టుగా ఎదిగినా.. ఇంగ్లండ్‌లో మాత్రం మరో సిరీసను సొంతం చేసుకోలేక పోయింది. 2021 పర్యటనలో భారత్ 2-1తో ఆధిక్యం సాధించినా.. కరోనా కారణంగా సిరీస్‌లో నాలుగో, ఆఖరి టెస్టును 2022కు వాయిదా వేశారు. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్ ఓడడంతో సిరీస్ 2-2తో సమమైంది.

## ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ బ్రాండ్ అంబాసిడర్‌గా కంగన



న్యూఢిల్లీ: నటి, పార్లమెంట్ సభ్యురాలు కంగన రనౌత్ ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిపనకు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితురాలైంది. ఈ మెగా టోర్నమెంట్ ఈ సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 5 వరకు ఢిల్లీ వేదికగా జరగనుంది. వంద దేశాలకు పైగా పారా అథ్లెట్లు పోటీపడే ఈ చాంపియన్‌షిపనకు అసలైన అంబాసిడర్ కంగన అని భారత పారాలింపిక్ కమిటీ తెలిపింది. అంబాసిడర్ హోదాలో మన చాంపియన్లకు మద్దతుగా నిలిచే అదృష్టం దక్కినందుకు చాలా సంతోషంగా ఉందని కంగన వ్యాఖ్యానించింది.

## విరాట్ స్థానం గిల్‌దే



హెడింగ్లీ: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడని వైస్-కెప్టెన్ పంత్ తెలిపాడు. తాను ఐదో స్థానంలోనే బరిలో దిగుతానని బుధవారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించాడు. విరాట్ రిటైరైన నేపథ్యంలో నాలుగో నెంబర్‌లో ఎవరు బ్యాటింగ్ చేస్తారోననే చర్చ బయలుదేరింది. దానికి పంత్ తెరదించాడు. 'మూడో నెంబర్ బ్యాటర్‌పై ఇంకా చర్చ జరుగుతోంది. కానీ 4, 5 స్థానాలలో ఎవరొస్తారో ఖరారైంది. గిల్ నాలుగో నెంబర్‌లో బరిలో దిగే చాన్సుంది. నేను మాత్రం ఐదో స్థానంలోనే బ్యాటింగ్ చేస్తా' అని పంత్ వివరించాడు.

## కోహ్లి లేకపోవడంతో

## ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్



లీడ్స్: బ్లాక్‌బస్టర్‌లాంటి టెస్ట్ సిరీస్‌లో విరాట్ కోహ్లీవంటి గొప్ప ఆటగాడిని ఎదుర్కోలేకపోవడం ఎంతో విచారకరమని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వ్యాఖ్యానించాడు. కోహ్లీ లేని భారత జట్టులో మునుపటి పోరాటతత్వం, గెలవాలన్న తపన సన్నగిల్లుతాయని అన్నా డు. టెస్ట్ ఫార్మాట్‌కు గత నెలలో విరాట్ వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. అంతకుముందు కొద్ది రోజుల కిందటే రోహిత్ శర్మ కూడా టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాడు. దాంతో సంధి దశలో ఉన్న భారత జట్టు యువ కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలో ఇంగ్లండ్‌ను ఐదు టెస్ట్‌ల్లో ఢీకొనబోతోంది. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) విడుదల జేసిన ఓ వీడియోలో స్టోక్స్...కోహ్లీ నిష్క్రమణపై తన అభిప్రాయాలను వెల్లడించాడు. మైదానంలో తామిద్దరిదీ ఒకే తరహా మైండ్‌సెట్ అనీ, అతనితో తలపడే అవకాశం లభించకపోవడం తనకే మాత్రం నచ్చడంలేదని స్టోక్స్ చెప్పాడు. ఇదే విషయాన్ని కోహ్లీకి మెసేజ్ చేశానని అన్నాడు. 'జెర్సీ నెంబర్ 18ని విరాట్ తనదిగా చేసుకున్నాడు. ఇకపై ఆ నెంబర్ ఏ భారత జట్టు క్రికెటర్ జెర్సీపైనా కనిపించకపోవడాన్ని జీర్ణించుకోవడం కష్టమే. కోహ్లీ ఆ నెంబర్‌కు అంతలా వన్నె తెచ్చాడు' అని బెన్ చెప్పుకొచ్చాడు ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో రోహిత్ శర్మకన్నా విరాట్ కోహ్లీలేని లోటు భారత్‌కు స్పష్టంగా కనిపిస్తుందని దిగ్గజ బ్యాటర్ బాయ్‌కాట్ అభిప్రాయపడ్డాడు. 'కోహ్లీ లేకపోవడం టీమిండియాపై పెను ప్రభావం చూపుతుంది' అన్నాడు.

## ఇంగ్లండ్‌కు సూర్యకుమార్



న్యూఢిల్లీ: టీమిండియా టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్ ఇంగ్లండ్ వెళ్లాడు. స్పోర్ట్స్ హెర్నియా (గజ్జల్లో లేదా పొత్తి కడుపులో నొప్పి) సంబంధిత గాయానికి చికిత్స కోసం అతను ఇంగ్లండ్ వెళ్లినట్టు బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించాడు. అవసరమైతే సూర్య తన గాయానికి శస్త్రచికిత్స కూడా చేయించుకునే అవకాశముందని తెలిపాడు. ఐపీఎల్ ముగిశాక సూర్య ముంబై టీ20 టోర్నీలో ఆడాడు. ఆ టోర్నీ సందర్భంగా అతనికి నొప్పి తీవ్రమైనట్టు సమాచారం. 'గాయానికి చికిత్స తీసుకోవడానికి ఇదే సరైన సమయమని సూర్య భావించాడు. చికిత్స అనంతరం పునరావాసం కోసం అతను బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో చేరనున్నాడు' అని బీసీసీఐ అధికారి పేర్కొన్నాడు.

## పిచ్‌తో భయపెడుతున్న ఇంగ్లండ్.. గట్టిగానే బిగిస్తున్నారు!




టీమిండియా బిగ్ చాలెంజ్‌కు రెడీ అవుతోంది. ఇంగ్లండ్‌ను వాళ్ల సొంతగడ్డపై ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. ఈ రెండు జట్ల మధ్య 5 టెస్ట్ మ్యాచులు జరగనున్నాయి. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ నయా సైకిల్ షురూ అవుతున్న నేపథ్యంలో ఈ సిరీస్‌లో గెలిచి తీరాలని రెండు జట్లు పట్టుదలతో కనిపిస్తున్నాయి. లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా జూన్ 20 నుంచి జరిగే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ నేపథ్యంలో మొదటి టెస్ట్ కోసం ఇంగ్లండ్ ఎలాంటి పిచ్‌ను తయారు చేస్తోంది? భారత్‌కు ఎలాంటి సవాళ్లు ఎదురవనున్నాయో ఇప్పుడు చూద్దాం..బౌలింగ్‌కు ఎక్కువగా అనుకూలించేలా లీడ్స్ పిచ్‌ను రూపొందించినట్లు తెలుస్తోంది. మొదటి రోజు పిచ్ ఫాస్ట్ బౌలర్లకు అనుకూలిస్తుందని, అనంతరం వేడి కారణంగా క్రమంగా ఫ్లాట్‌గా మారుతుందని వినిపిస్తోంది. పొడి వాతావరణం ఉండటం వల్ల రెండో రోజు నుంచి బ్యాటర్ల హవా నడిచే అవకాశాలు ఉన్నాయని సమాచారం. అయితే పేసర్లకు బౌన్స్, స్వింగ్ కూడా లభించే చాన్స్ ఉందని.. బజ్‌బాల్ క్రికెట్‌తో చెలరేగే ఇంగ్లండ్‌కు సరిపోయేలా పిచ్‌ను తయారు చేసినట్లు తెలుస్తోంది. ఇది తెలిసిన నెటిజన్స్.. మన బ్యాటర్లను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో పిచ్‌ను ఇలా రూపొందిస్తున్నారని అంటున్నారు. ముప్పు తప్పదు.. పేసుగుర్రం జస్‌ప్రీత్ బుమ్రా నేతృత్వంలోని భారత బౌలింగ్ దళం ఊరుకోదని, ఇంగ్లండ్‌ను ముప్పుతిప్పలు పెట్టడం ఖాయమని నెటిజన్స్ చెబుతున్నారు. పేస్ కండీషన్స్‌ను వాడుకొని మన బౌలర్లు చెలరేగడం ఖాయమని.. ఆతిథ్య జట్టును గట్టిగా బిగించడం ఖాయమని చెబుతున్నారు. పేస్ వికెట్ వల్ల ఇంగ్లండ్‌కూ ముప్పు తప్పదని, బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌కూ ఉపయోగపడేలా సమతూకమైన పిచ్‌ను రెడీ చేయిస్తే బాగుంటుందని కామెంట్స్ చేస్తున్నారు.

## బంగ్లాదేశ్ 484 ఆలౌట్



గాలె: శ్రీలంకతో తొలి టెస్ట్‌లో రెండో రోజు ఆఖరికి బంగ్లాదేశ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్లకు 484 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ 292/3 స్కోరుతో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ మరో 192 పరుగులు జోడించి 6 వికెట్లు కోల్పోయింది. కిందటి రోజు బ్యాటర్లు షంటో (148), ముష్ఫికర్ రహీమ్ (163) నాలుగో వికెట్‌కు 264 పరుగులు జోడించారు. అనంతరం లిటన్ దాస్ (90) జతగా ఐదో వికెట్‌కు ముష్ఫికర్ మరో 149 రన్స్ జత చేశాడు. అయితే రెండు గంటల పాటు వర్షంతో ఆటకు అంతరాయం ఏర్పడి తిరిగి మొదలయ్యాక లంక బౌలర్లు విజృంభించారు. 20.4 ఓవర్లు బౌల్ చేసి 61 పరుగులే ఇచ్చి 5 బంగ్లా వికెట్లు పడగొట్టారు.

## టుడే బిజినెస్

# పెట్టుబడిదారులకు గుడ్ న్యూస్.. ఈ చిన్న బ్యాంకుల్లో 8 శాతం వరకు వడ్డీ..




నేటి అస్థిర మార్కెట్ పరిస్థితులలో రిస్క్ చేసి పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ సిద్ధంగా లేరనేది వాస్తవం. అందుకే.. చాలా మంది సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్స్ ప్లాట్‌ఫామ్‌ల కోసం వెతుకుతుంటారు. మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయడం కంటే.. మంచి వడ్డీ రేట్లు వచ్చే ఫైనాన్స్ సంస్థలలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. చాలా మంది ప్రధాన బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్స్ చేస్తుంటారు. మరికొందరు ఎక్కువ వడ్డీ రేటు అందిస్తున్న స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్(%వాఖీదీ%) లలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల స్థిరమైన రాబడి రావడంతో పాటు.. ఇన్వెస్ట్ చేసిన డబ్బులకు రక్షణ ఉంటుంది. అయితే, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఒక్కో బ్యాంకు ఒక్కో విధమైన వడ్డీ రేట్‌ను అందిస్తుంది. అధిక వడ్డీ రేటు అందించే స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల గురించి ఇవాళ మనం తెలుసుకుందాం..

స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు అంటే ఏంటి..?

దేశంలో బ్యాకింగ్ రంగంలో పెద్ద పెద్ద బ్యాంకులతో పాటు.. చిన్న చిన్న ఫైనాన్స్ బ్యాంకులు కూడా ఉన్నాయి. ఇవి కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై పలు పథకాలు అమలు చేస్తున్నాయి. ఈ బ్యాంకులు ప్రధానంగా ఆర్థిక వ్యవస్థలోని వెనుకబడిన వర్గాలకు సేవలు అందిస్తుంటాయి. సాంప్రదాయ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే.. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ రేట్లను అందిస్తాయి. భద్రత, మెరుగైన రాబడిని కోరుకునే పొదుపుదారులకు ఇవి ఆకర్షణీయంగా ఉంటాయి.మీరు కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేద్దామని భావిస్తున్నారా.. పొదుపు డబ్బును పెంచుకోవానుకుంటున్నారా.. అత్యధిక ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను అందిస్తున్న స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. .

# స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు..



భౌగోళికంగా ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం వెండి ధరలు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువలో ట్రేడ్ అవుతున్నాయి. నిన్నటితో పోల్చుకుంటే ఈ రోజు బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జూన్ 19న) ఉదయం 6.00 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 1, 00, 920కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 92, 500కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధర ఈ రోజు దాదాపు రూ.600 పెరిగింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 01, 070కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 92, 660కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 00, 920కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 92, 500కి చేరింది. వెండి ధరలు కేజీకి రూ100 మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

# వెండి సరికొత్త రికార్డు




వెండి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయికి ఎగబాకింది. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రేటు బుధవారం రూ.1,000 పెరిగి రూ.1.21 లక్షలకు చేరిం ది. వెండి ధర పెరగడం వరుసగా ఇది మూడో రోజు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో (ఎంసీఎక్స్) కూడా వెండి ఫ్యూచ ర్స్ కాంట్రాక్టు ధరలు ఆల్‌టైం రికార్డు స్థాయిని తాకాయి. జూలై గడువు కాంట్రాక్టు ధర రూ.1,09,748కి, సెప్టెంబరు గడు వు కాంట్రాక్టు రేటు రూ.1.11 లక్షలకు ఎగబాకింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న విలువైన లోహాలపైకి దృష్టి మళ్లించారు. అయితే, బంగారం ధరలు ఇప్పటికే రికార్డు స్థాయిల్లో కొనసాగుతుండటంతో వెండిలో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఎక్కువగా మొగ్గుచూపుతున్నట్లు విశ్లేషకులు తెలిపారు. అలాగే, పారిశ్రామిక అవసరాలకు తగినంత స్థాయిలో సరఫరా లేకపోవడం కూడా వెండి ధర లు ఎగబాకడానికి మరో కారణం. దాంతో అంతర్జాతీయ విపణిలో ఔన్స్ (31.10 గ్రాములు) వెండి రేటు ఒక దశలో 37.23 డాలర్లకు చేరింది. 2012 ఫిబ్రవరి తర్వాత వెండికిదే గరిష్ఠ స్థాయి. దశాబ్దానికి పైగా కాలంలో ఔన్స్ సిల్వర్ 37 డాలర్లు దాటడం ఇదే మొదటిసారి.

ఈ ఏడాదిలో రూ.23,000 పెరుగుదల

2025 జనవరి 1న హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.98,000గా ఉంది. అంటే, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రేటు రూ.23,000 పెరిగింది. ముమ్ముందు మరింత ఎగబాకే అవకాశం ఉందని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ వెండి 36.89 డాలర్ల వద్ద కీలక నిరోధ స్థాయిని అధిగమించడమే ఇందుకు కార ణం. తదుపరి దశలో 40 డాలర్ల దిశగా పరుగు తీయవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, 38.34 డాలర్ల స్థాయిలో గట్టి నిరోధం ఎదురుకావచ్చని వారు భావిస్తున్నారు.

రూ.లక్షపైన బంగారం

మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర 10 గ్రాములకు రూ.540 పెరుగుదలతో రూ.1,00,910కి చేరింది. 22 క్యారెట్ల లోహం రేటు రూ.500 పెరుగుదలతో రూ.92,500కు ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ఒకదశలో 3,400 డాలర్ల ఎగువన ట్రేడైంది.

భవిష్యత్‌లో రూ.2 లక్షలు?

వెండి ధరలు భవిష్యత్‌లో రెట్టింపు కానున్నాయని, ఔన్స్ సిల్వర్ 70 డాలర్లకు చేరుకోవచ్చని రిచ్ డాడ్.. పూర్ డాడ్ పుస్తక రచయిత, ప్రముఖ ఇన్వెస్టర్ రాబర్ట్ కియోసాకీ అంచనా వేశారు. అంతర్జాతీయంగా రాజకీయ భౌగోళిక అనిశ్చితులు పెరుగుతుండటంతోపాటు ఎలక్ట్రానిక్స్ రంగం శరవేగ వృద్ధి నేపథ్యంలో ఇండస్ట్రీ అవసరాలకు తగినంత వెండి సరఫరా జరగకపోవడం ఇందుకు కారణమన్నారు. రాబర్ట్ అంచనాలు నిజమైతే, దేశీయ మార్కెట్లో కిలో వెండి రూ.2 లక్షలు దాటుతుంది.

# మరోసారి మైక్రోసాఫ్ట్‌లో లేఆఫ్స్.. వేలల్లో తొలగింపులు ఉంటాయంటూ కథనాలు వైరల్



ఇంటర్నెట్ డెస్క్: భారీ స్థాయిలో ఉద్యోగులను తొలగించేందుకు ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ సిద్ధమవుతోంది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు కలకలం రేపుతున్నాయి. వేలల్లో ఉద్యోగులను తొలగిస్తారని సమాచారం. మే నెలలో లేఆఫ్స్‌లో ఏకంగా 6 వేల మందిని జాబ్స్ నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో మరోసారి మైక్రోసాఫ్ట్ లే ఆఫ్స్‌కు రెడీ అయ్యిందన్న వార్త సంచలనంగా మారింది. వచ్చే నెలలో ఈ లేఆఫ్స్ ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అయితే, ఈ వార్తలపై సంస్థ ఇంకా స్పందించాల్సి ఉంది.

ఈసారి లేఆఫ్స్ ప్రభావం కస్టమర్ ఫేసింగ్ రోల్స్‌లోని ఉద్యోగులపై ఎక్కువగా ఉండొచ్చని సమాచారం. మునుపటి లేఆఫ్స్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రాడక్ట్ డెవలపర్లు ఎక్కువగా జాబ్స్ పోగొట్టుకున్నారు. మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగుల సంఖ్య సుమారు 2.28 లక్షలు. సేల్స్, మార్కెటింగ్ విభాగంలో 45 వేల మంది పని చేస్తున్నారు.స్వల్ప శ్రేణి, మధ్య శ్రేణి సంస్థలకు మైక్రోసాఫ్ట్ ఉత్పత్తుల మార్కెటింగ్, సేల్స్ బాధ్యతలను థర్డ్ పార్టీ ఫర్మ్‌కు బదిలీ చేసేందుకు సిద్ధమైనట్టే ఏప్రిల్‌లోనే మైక్రోసాఫ్ట్ సంకేతాలిచ్చింది. ఇక ఏఐపై కూడా దృష్టి పెట్టిన సంస్థ ఈ ఏడాది సుమారు 80 బిలియన్ డాలర్ల పెట్టుబడులను డాటా సెంటర్ల ఏర్పాటు, అభివృద్ధికి కేటాయించింది. అదే సమయంలో ఖర్చులు తగ్గించుకునేందుకు కూడా ఏర్పాట్లు చేసుకుంటోంది. అయితే గతంలో చేపట్టిన తొలగింపులు సంస్థ పునర్వ్యవస్థీకరణలో భాగమని ఇటీవల సీఈఓ సత్య నాదెళ్ల పేర్కొన్నారు. పనితీరు ఆధారిత తొలగింపులు కావని స్పష్టం చేశారు. కరోనా సమయంలో భారీగా నియామకాలు చేపట్టిన సంస్థ 2023 జనవరిలో సుమారు 10 వేల మందిని తొలగించింది. ఆక్టీవిజన్ బ్లిజర్డ్‌ను చేజిక్కించుకున్నాక వీడియోగేమ్ విభాగంలోనూ లేఆఫ్స్ చేపట్టింది.అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తున్న నేపథ్యంలో లేఆఫ్స్ భయాలు పెరుగుతున్నాయి. క్రియేటివ్, క్లరికల్, కస్టమర్ సర్వీస్ ఉద్యోగులకు ఆటోమేషన్ రిస్క్ ఎక్కువగా ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. భారత్‌లో 66 శాతం మంది ఏఐ ప్రభావం తమ జాబ్‌పై ఉండొచ్చని ఆందోళనతో ఉన్నట్టు ఇటీవల జరిగిన ఓ సర్వేలో తేలింది. అయితే, ఏఐ సామర్థ్యంతో ప్రయోజనాలపై 65 శాతం మంది ఆసక్తి ప్రదర్శించారు. ఏఐతో కొత్త జాబ్స్ అందుబాటులోకి వస్తాయని ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ ఇటీవల పేర్కొన్నారు. ఏఐతో ఉత్పాదకత పెరుగుతుందని, మానవవనరులను ఇతర సృజనాత్మకమైన పనుల వైపు మళ్లించే అవకాశం ఉంటుందని ఆల్ఫబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ కూడా అన్నారు.

# పిఎస్‌యూల స్వచ్ఛంద డీలిస్టింగ్‌కు సెబీ లైన్ క్లియర్



న్యూఢిల్లీ: పెట్టుబడుల మార్కెట్‌లో మరిన్ని సంస్కరణలకు సెబీ శ్రీకారం చుట్టింది. చైర్మన్ తుహిన్ పాండే అధ్యక్షతన బుధవారం సమావేశమైన సెబీ బోర్డు దీనికి సంబంధించి పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

సెబీ బోర్డు తీసుకున్న కీలక నిర్ణయాలు...

ప్రభుత్వ రంగ సంస్థల (పీఎసయూ) స్వచ్ఛంద డిలిస్టింగ్ కు అనుమతిస్తూ సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈక్విటీలో 90 శాతం లేదా అంతకంటే ఎక్కువ వాటా ప్రభుత్వానికి ఉన్న పీఎసయూలకు మాత్రమే ఈ వెసులుబాటు ఉంటుంది. కాకపోతే ఇందుకు మెజారిటీ వాటాదారుల ఆమోదంతో పాటు, రెగ్యులేటరీ సంస్థల అనుమతి అవసరం. ఈ సంస్కరణతో పీఎసయూల వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ మరింత వేగంగా పూర్తవుతుందని భావిస్తున్నారు.

స్టార్టప్స్- ఈసాప్స్: ఐపీఓల తర్వాత కూడా స్టార్టప్ కంపెనీల ప్రమోటర్లు ఉద్యోగుల తరహాలో ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్స్ (ఈసాప్స్) కలిగి ఉండేందుకు సెబీ బోర్డు ఆమోదం తెలిపింది. కాకపోతే ఐపీఓకు ఏడాది ముందే వీరు ఈ షేర్లను డిమ్యాట్ రూపంలో కలిగి ఉండాలని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం ఐపీఓల తర్వాత స్టార్ట్‌పల వ్యవస్థాపకులను ప్రమోటర్లుగా పరిగణించి ఈసాప్ షేర్లు కలిగి ఉండేందుకు అనుమతించరు. తాజా సంస్కరణ స్టార్టప్ కంపెనీల దీర్ఘకాలిక వృద్ధిలో ప్రమోటర్లు మరింత మమేకమయ్యేందుకు వీలవుతుందని భావిస్తున్నారు.

ఏఐఎఫలకు వెసులుబాటు: ప్రత్యామ్నాయ పెట్టుబడి పథకాల్లో (ఏఐఎఫ్) మదుపు చేసే వారికి సెబీ కొత్త వెసులుబాటు కల్పించింది. ఇక ఈ మదుపరులు ఏఐఎఫలు పెట్టుబడులు పెట్టిన అన్‌లిస్టెడ్ కంపెనీల్లో అదనపు పెట్టుబడులు పెట్టేందుకు అనుమతిస్తారు. కాకపోతే ఏఐఎఫలు ఇందుకోసం ప్రత్యేక పథకంలా ఒక స్వతంత్ర కో ఇన్వెస్టమెంట్ వెహికల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాగే ఏఐఎఫల మేనేజర్లు అన్ని రకాల మదుపరులకు సలహా సేవలు అందించేందుకూ సెబీ ఆమోదం తెలిపింది.

ప్రభుత్వ రుణ పత్రాలు - ఎఫ్‌పీఐలు: ప్రభుత్వ రుణ పత్రాల్లో విదేశీ పోర్టుఫోలియో మదుపరుల పెట్టుబడుల రిజిస్ట్రేషన్, కంప్లయన్స్ ప్రక్రియను సెబీ మరింత సులభం చేసింది. దీంతో ఎఫ్‌పీఐలు మరింత చురుగ్గా పెద్దగా నష్ట భయం లేని ప్రభుత్వ రుణ పత్రాల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టేందుకు మార్గం సుగమమైంది. వీటికి తోడు ఇన్‌ఫ్రా కంపెనీలు, రియల్ ఎస్టేట్ కంపెనీలు జారీ చేసే ఇన్విట్స్, రీట్స్‌ను ఈక్విటీ షేర్లుగా పరిగణించేందుకు సెబీ బోర్డు ఆమోదం తెలిపింది. క్యూఐపీ ఇష్యూల నిబంధనల వెల్లడినీ మరింత సులభతరం చేసింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006